ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 1 అనంతపురం జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 42.0 27.0



కళ్యాణదుర్గంలో నామినేషన్ మహోత్సవానికి హాజరైన అశేష జనవాహిని

అభివృద్ధి ఏమిటో చూపిస్తా..!

ఒక్క అవకాశం ఇవ్వండి.. టీడీపీని గెలిపించండి

ప్రజలకు టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని వినతి

వేలాది మందితో కళ్యాణదుర్గంలో ర్యాలీ.. నామినేషన్

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 25: ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలకు చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆయన నామినేషన్ మహోత్సవానికి హాజరైన జనంతో కళ్యాణదుర్గం వీధులు గురువారం పోటెత్తాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జనం ప్రభంజనంలా తరలివచ్చారు. పసుపు జెండా చేతబట్టి జై తెలుగుదేశం.. జై చంద్రబాబు... జై అమిలినేని అంటూ నినాదాలతో హోరెత్తించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా పోటెత్తిన జనానికి అభివాదం చేస్తూ అమిలినేని సురేంద్రబాబు నామినేషన్‌కు భారీ ర్యాలీతో తరలివెళ్లారు. దారి పొడవునా అభిమాన జన తరంగం ఆయనపై పూలవర్షం కురిపించింది. పట్టణంలోని ప్రజావేదిక నుంచి గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన భారీ ర్యాలీ.. బ్రహ్మయ్య గుడి మీదుగా వాల్మీకి సర్కిల్‌కు చేరుకుంది. అక్కడ వాల్మీకి విగ్రహానికి అమిలినేని పూలమాలలు వేసి ముందుకు సాగారు. గాంధీ సర్కిల్, మసీదు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. కాంతార, గొరవయ్యల నృత్య ప్రదర్శన, డీజే సాంగ్స్‌తో ర్యాలీ ఆకట్టుకుంది. ర్యాలీ అనంతరం తన నామినేషన్ పత్రాన్ని ఆర్వో రాణి సుష్మితకు ఆయన అందజేశారు.



ఆర్వో రాణి సుష్మితకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు



రోడ్డు పొడవునా స్వాగతం

మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: అమిలినేని

మసీదు సర్కిల్‌లో అమిలినేని సురేంద్రబాబు ప్రసంగించారు. కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, చంద్రబాబు పరిపాలనపై నమ్మకంతో ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అన్ని వర్గాల ఆదరాభిమానాలను చూరగొంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో రైతాంగ, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు తదితర సమస్యలన్నీ పరిష్కరిస్తానని అన్నారు. మూడేళ్లకాలంలో 114 చెరువులకు కృష్ణా జలాలు తీసుకువచ్చి, రైతుల మన్ననలు పొందుతామని అన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ స్థలాలను నిరుపయోగంగా వదిలేశారని, వాటిలో కాంప్లెక్స్‌లు నిర్మించి.. మున్సిపల్ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. తన ప్రత్యర్థులు గత ఐదేళ్లలో ఏమి చేశారని ప్రశ్నించారు. మంత్రి ఉష శ్రీచరణ్, ఎంపీ రంగయ్య వర్గాలుగా విడిపోయి దోచుకున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ఒక్కపైసా అవినీతి చేయకుండా అభివృద్ధి చేస్తానని, తనను గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, చంద్రబాబు పాలన కోరుకుంటున్నారని అన్నారు. 'ఒక్క చాన్స్ ఇవ్వండి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపుతా' అని హామీ ఇచ్చారు. టీడీపీ జనప్రవాహాన్ని చూసి వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ప్రజాబలంతో 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ మహోత్సవానికి నియోజకవర్గం నుంచి 50 వేల మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు భాగస్వాములయ్యారు.



రాప్తాడులో ర్యాలీకి హాజరైన టీడీపీ శ్రేణులు





రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందిస్తున్న పరిటాల సునీత

రాప్తాడులో అభివాదం చేస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

రాప్తాడులో టీడీపీ జెండా ఎగరేస్తాం..!

టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీత అట్టహాసంగా నామినేషన్.. భారీ బహిరంగ సభ

రాప్తాడు, ఏప్రిల్ 25: రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి పరిటాల సునీత, పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ధీమా వ్యక్తం చేశారు. రాప్తాడులో టీడీపీ కూటమి అభ్యర్థిగా పరిటాల సునీత గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తమ స్వగ్రామం వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లమ్మ ఆలయంలో, పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద పూజలు చేశారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో రాప్తాడు తహసీల్దార్ కార్యాలయానికి బయలు దేరారు. రామగిరి, ఎన్ఎస్ గేటు, మామిళ్లపల్లి, మరూరు తదితర గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో పరిటాల సునీతకు ర్యాలీ కొనసాగింది. ఉదయం 11:30 గంటలకు పరిటాల సునీత రాప్తాడుకు చేరుకుని తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబుకు నామినేషన్ పత్రం అందచేశారు. అనంతరం పరిటాల సునీత, శ్రీరామ్ ప్రచార రథం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. వారిని నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి రాప్తాడులో సమీపంలో పంజాబీ డాబా వద్ద గల సభా స్థలానికి చేరుకున్నారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి సభలో పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తాం: పరిటాల సునీత

"రాప్తాడు నియోజకవర్గం టీడీపీ కంచుకోట. ఇక్కడి ప్రజలు మా కుటుంబాన్ని ఏళ్ల నుంచి ఆదరిస్తున్నారు. మా ప్రాణం ఉన్నన్నాళ్లు మీకు సేవ చేసినా.. మీ రుణం తీర్చుకోలేము. 2014 నుంచి 2019 వరకూ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. చెరువుకు నీరు అందించి రైతులకు అండగా నిలిచాం. రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. అధికారంలోకి వచ్చాక ప్రతి ఎకరానికీ సాగునీరు ఇస్తాం. సోలార్ హబ్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. జాకీ పరిశ్రమ స్థానంలో పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. అనంతపురం రూరల్ మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించి, ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తాం. పేరూరు కాలువకు భూములిచ్చిన రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందిస్తాం. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం. ప్రకాశ్‌రెడ్డి గత ఎన్నికల్లో 32 వేల దొంగ ఓట్లతో గెలిచాడు. టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని మీసం మెలేసి నిలదీయండి. ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పమనండి. నామినేషన్ వేసినప్పుడు పరిటాల, చంద్రబాబు ఆస్తులను ప్రజలకు పంచుతామని చెప్పాడు. ప్రకాశ్‌రెడ్డీ.. నువ్వు మగాడివైతే మా ఆస్తులు పంచు. ఎవరి ఆస్తులు ఎవరు పంచుతారో జూన్ 4న తెలుస్తుంది. పరిటాల రవి కాలి గోటికి కూడా నువ్వు సరిపోవు. ఒక్క సారి గెలిచినందుకు పెద్ద పుడింగి లాగా ఫీలవుతున్నావ్. ఎన్నికల్లో ఓడిపోతే మీసం తీయించుకుంటానని అన్నావ్. బ్లేడు తీసుకుని సిద్ధంగా ఉండు."

అన్నింటా గెలుపు టీడీపీదే

బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ అభ్యర్థి



"హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలుపు ఖాయం. ప్రకాశ్‌రెడ్డి నామినేషన్ కంటే పరిటాల సునీత నామినేషన్‌కు భారీగా జనాలు వచ్చారు. ఈ స్పందన చూస్తుంటే ఎంత మెజార్టీ వస్తుందో ఊహించుకోవచ్చు. పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పుడు రాప్తాడులో ఎంత అభివృద్ధి చేశారో నేను చూశాను. పరిటాల సునీతను మరోసారి గెలిపించుకుంటే రాప్తాడు మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, దుర్మార్గపు పాలన ఉంది. రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టారు. రాప్తాడులో ప్రకాష్ రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి. సైకో పాలనను తరిమి కొట్టేందుకే కూటమి ఏర్పడింది. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పని చేయాలి. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తుంచుకుంటాం. సమయం లేకపోవడం వలన అన్ని గ్రామాలకు రాలేకపోతున్నాం. గెలిచిన తరువాత ప్రతి గ్రామానికి వస్తాను. సమస్యలు పరిష్కరించి రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను.

బ్లేడ్‌తో సిద్ధంగా ఉండు: పరిటాల శ్రీరామ్

"30 ఏళ్ల నుంచి ప్రజలు మా కుటుంబానికి అండగా ఉన్నారు. ఎక్కడికి వెళ్లినా మా గెలుపుకు కృషి చేస్తున్నారు. 20 రోజులు ఉంటే ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఈ పడగొడతారు. ఎన్నికల్లో ఓడితే మీసం గీయించుకుంటానని ప్రకాశ్‌రెడ్డి శపథం చేశాడు. మీసం తీయించుకునే టైం దగ్గరికి వచ్చింది. బ్లేడుతో సిద్ధంగా ఉండు ప్రకాష్ రెడ్డీ..! ఈ నామినేషన్ చూస్తేనే ప్రకాశ్‌రెడ్డికి అర్థమయింటుంది. మా ఆస్తులు పంచుతానని అంటున్నావ్. ఫలితాల తర్వాత నీ అక్రమ ఆస్తులు ప్రజలు ఖచ్చితంగా కొల్లగొడతారు. రాజకీయాలను నీచంగా మార్చిన పనికిమాలిన వ్యక్తి ప్రకాశ్‌రెడ్డి. ప్రకాశ్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలి. పరిటాల కుటుంబం గురించి ఇష్టానుసారం మాట్లాడొద్దు. ఐదేళ్ల పడిన కష్టాలను, గ్రామాల్లో సమస్యలను ప్రజలు గుర్తు తెచ్చుకోవాలి. దుర్మార్గపు పాలనం అంతం చేయడానికి సైకిల్ గుర్తుకు ఓటేయాలి.

టీడీపీ విజయాన్ని ఆపలేరు

శింగనమల అభ్యర్థి బండారు శ్రావణి

వేలాది మందితో ర్యాలీ.. అట్టహాసంగా నామినేషన్



బుక్కరాయసముద్రం/శింగనమల: టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆ పార్టీ కూటమి అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ సందర్భంగా గురువారం శింగనమలలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు, పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకతో శింగనమల పసుపు మయమైంది. చెరువుకట్ట ప్రాంతం, నామినేషన్ కార్యాలయం పరిసరాలు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి. ర్యాలీ సందర్భంగా డప్పులు, బాణసంచా మోత మోగింది. శింగనమల మరవకొమ్మ వద్ద నుంచి వేలాది కార్యకర్తలు, నాయకులతో కలిసి వచ్చిన శ్రావణిశ్రీ, శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ శ్రేణులు భారీగా కదలిరావడంతో ర్యాలీ రెండుగంటల పాటు సాగింది. ఆమె వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిముడుగు కేశవరెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, గంజేనాగరాజు, దండు శ్రీనివాసులు, సుధాకర్‌యాదవ్, సాకే రామకృష్ణ షాలినీదొర, డేగల కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఎద్దుల బండిపై నామినేషన్‌కు...

కాగా శింగనమల చెరువు వద్ద కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎద్దుల బండిలో ఎక్కి నామినేషన్ కార్యక్రమానికి బండారు శ్రావణిశ్రీ హాజరుకావడం అందరినీ ఆకట్టుకుంది. నామినేషన్ కార్యక్రమానికి ముందు ఆమె పార్టీ నాయకులతో కలిసి బుక్కరాయసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇసుక అక్రమార్కుడు.. వీరాంజి

వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు టిప్పర్ డ్రైవర్ కాదని, ఇసుక అక్రమార్కుడని బండారు శ్రావణి శ్రీ విమర్శించారు. వీరాంజనేయులు టిప్పర్ డ్రైవర్ అంటూ నకిలీ ప్రచారం చేస్తున్నారన్నారు. అసలు నిజం ఎన్నికల అఫిడవిట్‌లో తేలిందన్నారు. సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి ఇంటికి ఈయన బినామీ అని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు ఎమ్మెల్యే కుటుంబం దోచుకోవడానికి దోహదపడ్డాడన్నారు. అందుకు కృతజ్ఞతగానే ఎమ్మెల్యే టిక్కెట్టు ఇప్పించుకున్నారని ఆరోపించారు. వీరాంజనేయులకు ఓటు వేస్తే నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు, వంకలు, కొండ గుట్టలు లేకుండా చేస్తారని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శింగనమల సహా రాష్ట్రంలో టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని అన్నారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడతామని, ఆయన స్ఫూర్తితో నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు.





శింగనమలలో నామినేషన్ వేస్తున్న టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ, పాల్గొన్న ఆలం, కేశవరెడ్డి బుక్కరాయసముద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25: టీడీపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు చోటు దక్కింది. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన ఉన్నం మారుతీచౌదరిని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన కే.ఎం జకీవుల్లాకు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా, జయరాం నాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించారు. బీవీ వెంకటరాముడును టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటరుగా నియమించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధిగా సాకే నరసింహను నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ కార్యకర్తల చీనీతోటకు నిప్పు



కాలిపోయిన చీనీచెట్లు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 25: మండలంలోని మేడాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలకు చెందిన చీనీతోటకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నిప్పు పెట్టారు. రైతు పసల రత్నమ్మ, టీడీపీ కార్యకర్తలైన ఆమె కుమారులు తెలిపిన మేరకు..గ్రామ సమీపంలో రెండెకరాల పొలంలో దాదాపు 15 ఏళ్లుగా 450 చీనీ చెట్లను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉందని రైతు రత్నమ్మ తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో తోటకు మంటలు వ్యాపించాయన్నారు. స్థానికులు ద్వారా సమాచారం అందుకుని నీటి ట్యాంకర్ ద్వారా మంటలను ఆర్పివేశామన్నారు. అప్పటికే దాదాపు 10 చెట్లు కాలిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాప్తాడులో పరిటాల సునీత నామినేషన్ కార్యక్రమానికి తాము వెళ్లిన క్రమంలో ఎవరో కావాలనే తోటకు నిప్పుపెట్టి ఉంటారనే అనుమానాన్ని టీడీపీ కార్యకర్తలైన చంద్ర, కార్తీక్ ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకులు తోటను సందర్శించి వివరాలను బాధిత కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, ఏప్రిల్ 25: ఓపెన్ టెన్త్, ఇంటర్ - 2024 పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్ పరీక్షల్లో 907 మంది హాజరుకాగా 598 మంది పాసయ్యారని, ఇంటర్మీడియట్‌లో 2645 మంది హాజరు కాగా 1809 మంది పాసయ్యారని పేర్కొన్నారు. టెన్త్‌లో 65.71 శాతం, ఇంటర్‌లో 68.39 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జక్టుకు రూ. 200, రీ వెరిఫికేషన్‌కు అయితే ఒక్కో సబ్జక్టుకు రూ. 1000 చెల్లించాల్సి ఉందన్నారు.

జూన్‌లో సప్లిమెంటరీ పరీక్షలు

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తారని డీఈఓ తెలిపారు. పరీక్షల ఫీజు ఈనెల 29 నుంచి మే 4వ తేదీ వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఒక్కో సబ్జక్టుకు రూ. 25 అపరాధ రుసుంతో మే 5,6 తేదీల్లో, రూ. 50 అపరాధ రుసుంతో మే 7,8 తేదీల్లో, తత్కాల్‌లో మే 9,10 తేదీల్లో సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఎంపీ అభ్యర్థిగా అంబికా నామినేషన్ దాఖలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25:

అనంతపురం పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్‌కు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, నాయకులు మహబూబ్ బాషాలతో కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతోపాటు రెండు ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

ఎంపీకి 38.. ఎమ్మెల్యేలకు 220 పైగా..

ముగిసిన నామినేషన్ల గడువు

నేడు నామినేషన్ల పరిశీలన

ఉపసంహరణకు 29వరకు గడువు

మే 13న ఎన్నికలు

జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 18 నుంచి జిల్లాలో అనంత పార్లమెంటు స్థానానికి, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు జిల్లా యంత్రాంగం నామి నేషన్లు స్వీకరించింది. వివరాలు ఇలా..

అనంత పార్లమెంటుకు 38..

అసెంబ్లీ స్థానాలకు 220కుపైగా ..

● నేటితో పోస్టల్‌బ్యాలెట్‌కు ఆఖరిగడువు

పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం చివరిరోజు అని కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న ప్రతి శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓటు కోసం ఫారం-12ను పనిచేసే నియోజవర్గ ఆర్‌ఓలకు ఇవ్వాలని కలెక్టరు కోరారు.

రేపే పాలిసెట్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25: మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు పాలిసెట్-2024ను శనివారం నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ నిర్వహణ ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8880మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారని, జిల్లాలో మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తామని, ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌తో పాటు హెచ్‌బీ పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్ వెంట తీసుకురావాలని సూచించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఈశ్వరకుమార్(ఫైల్)

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25: మండలంలోని అక్కంపల్లి పంచాయతీ ఎస్ఆర్ కాలనీకి చెందిన సుగాలి ఈశ్వరకుమార్ (52) వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కులి పనులు చేసుకునే ఈశ్వరకుమార్ గురువారం ఉదయం మాజీ మంత్రి పరిటాల సునీత నామినేషన్ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రాప్తాడుకి వెళ్లాడు. కార్యక్రమం ముగిసి ఇంటికి వచ్చిన తరువాత ఒంట్లో అలసటగా ఉందని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులతో పరీక్షలు చేయించుకున్నాడు. ఆస్పత్రిలో అడ్మిట్ అవ్వమంటే లేదు రేపు ఉదయం వచ్చి చేరుతానని మందులు తీసుకుని ఇంటి వచ్చాడు. తరువాత కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాతు రూములోకి వెళ్లిన ఆయన అక్కడే కుప్పకూలి చనిపోయాడని తెలిపారు. మృతుడికి భార్య, ప్రమీళ, కుమార్తె అన్విత ఉన్నారు.

ఏసీబీ డీఎస్పీగా సుధాకర్‌రెడ్డి



అనంతపురం క్రైం, ఏప్రిల్ 25: జిల్లా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీగా ఎస్.సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయు) విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న సుధాకర్‌రెడ్డిని అనంతపురం డీఎస్పీగా నియమించారు. ఏడాదిన్నరగా ఈ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. నూతన డీఎస్పీకి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

● ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

గుత్తి, ఏప్రిల్ 25: గుత్తిఆర్ఎస్‌లో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. మూడు నెలలుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో గుత్తి ఆర్ఎస్‌లోని ఏడో వార్డు మహిళలు ఖాళీ బిందెలు తీసుకుని పత్తికొండ రోడ్డు సర్కిల్లో ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మూడు నెలలుగా కొళాయిలకు తాగునీరు సరఫరా చేయకపోతే తాము ఎలా జీవించాలం టూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడం లేదని మండిపడ్డారు. కొళాయిల ద్వారానే నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో చెట్నెపల్లికి ప్రచారం నిమిత్తం వెళ్తున్న టీడీపీ అభ్యర్థి సోదరుడు గుమ్మనూరు నారాయణ, నాయకులు ఆందోళనకారుల వద్దకు వెళ్లి నచ్చజెప్పారు. తమ సమస్యను మహిళలు వారి దృష్టికి తెచ్చారు. దీంతో వారు మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తామని అధికారులు చెప్పారని నాయకులు చెప్పడంతో మహిళలతో ఆందోళన విరమించారు.

పరిశీలన పక్కాగా చేపట్టాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25: నామినేషన్ల స్క్రూట్నీ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్క్రూట్నీపై రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. శుక్రవారం షెడ్యూల్ మేరకు నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ) జరగుతుందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చిన నామినేషన్లను పక్కాగా పరిశీలించాలన్నారు. ఇందుకు ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరిశీలనపై ఎక్కడైనా, ఏమైనా సందేహాలు వస్తే వెంటనే వాటిని నివృత్తి చేసుకొని పకడ్బందీగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.



అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

కోట్లాట!

ఎన్నికల విజయంపై బెట్టింగుల జోరు
ఐపీఎల్ పందేలను మరిపిస్తున్న వైనం
తాడిపత్రి ఫలితంపై పక్క జిల్లాల నుంచి పందేలు
ఉచ్చులో సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో బెట్టింగ్‌లు మొదలయ్యాయి. ఐపీఎల్ క్రికెట్ పోటీలను మరపించే రీతిలో పందేలు జరుగుతున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే అందరి చూపు తాడిపత్రి వైపు ఉంటుంది. రాష్ట్రంలో కొందరు తమ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను పట్టించుకోకుండా తాడిపత్రిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీస్తుంటారు. నియోజకవర్గానికి సమీపంలో ఉన్న కర్నూలు, కడప, నంద్యాల జిల్లావాసులు తాడిపత్రి ఫలితం గురించి రూ. కోట్లలో బెట్టింగ్‌లు కాస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికలు ఇంకా 17 రోజులు ఉండగానే నియోజకవర్గంలో బెట్టింగ్‌లు తారస్థాయికి చేరాయి. కోట్ల రూపాయలు పెట్టి పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని యాడికి, రాయలచెరువుకు చెందిన ఐదుగురు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి కోటి రూపాయల వరకు బెట్టింగ్ పెట్టినట్లు చర్చించుకుంటున్నారు. తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి 13500 ఓట్ల మెజార్టీతో గెలుపొందుతాడని కొందరు, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి 13500 ఓట్ల మెజార్టీతో గెలుస్తాడని కొందరు రూ.30లక్షలు బెట్ వేసుకున్నట్లు సమాచారం. బెట్టింగ్ కోసం ఒక నాయకుడి వద్ద నగదు లేకపోవడంతో తన ఇంటి పత్రాలను పూచీకత్తుగా పెట్టి నట్లు చర్చ సాగుతోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి మూలకారణమైన పెద్దవడుగూరు మండలంలో ఈ సారి ఆపార్టీ మెజార్టీ మరింత ఎక్కువగా ఉంటుందని పందేలు కాస్తున్నట్లు సమాచారం.

మేము సైతం అంటూ ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

డబ్బుల మీద అత్యాశతో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వర్క్‌ఫ్రం హోం చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్లు నేరుగా బెట్టింగ్‌కు పాల్పడితే తమ హోదాకు భంగం వాటిల్లుతుందన్న భయంతో మిత్రులు, నమ్మకస్తుల ద్వారా పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పనిచేస్తున్న వారు నేరుగా ఏజెంట్లకు ఫోన్లు చేసి బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం.

రెండింతలు, మూడింతలతో బెట్టింగ్

ఆరునూరైనా ఈసారి ఎన్నికల్లో తాడిపత్రిలో తమ జెండా ఎగురుతుందని ఎవరికి వారు ప్రధాన పార్టీల సానుభూతిపరులు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. సాధారణంగా ఎంత మొత్తం బెట్ కడితే గెలిచిన వారికి అంతే మొత్తం ఇస్తుంటారు. కానీ రెండు, మూడు రెట్లు ఎక్కువ ఇస్తామంటూ పందేలు కడుతున్నట్లు సమాచారం. దీనికి ఆశపడుతున్న కొందరు యువకులు అప్పులు చేసి మరీ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వంద నుంచి 120సీట్లు సాధించి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పలువురు లక్షకు రూ.2లక్షలు ఇస్తామని చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ, వైసీపీ నాయకులు కలిసి మందు పార్టీలు ఏర్పాటు చేసుకొని మరీ బెట్టింగులకు దిగుతున్నారన్న చర్చ జరుగుతోంది.



జన చేతనం
ఆంధ్రజ్యోతి

మైనార్టీలను మభ్యపెడుతున్నారా..?

- మగ్బుల్ మాటలను ఆ వర్గాలు నమ్ముతాయా..?
- కదిరిలో వైసీపీ ద్వంద్వ వైఖరిపై మైనార్టీల ఆగ్రహం

కదిరి, ఏప్రిల్ 25 : ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి వైసీపీ అభ్యర్థి బీఎస్ మగ్బుల్ అహమ్మద్ చెబుతున్న మాటలను మైనారిటీలు నమ్ముతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల ఓ టీవీ చానల్లో మాట్లాడుతూ తాము భేషరతుగా బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. బీజేపీ పెట్టిన బిల్లులు అన్నిటికి వైసీపీ మద్దతు తెలిపింది. సీఏఏ, ఎన్‌ఆర్‌సీకి మద్దతు ప్రకటించింది. ఎంపీ విజయసాయి రెడ్డి గత పార్లమెంటులో బీజేపీ పెట్టిన బిల్లులకు మద్దతు పలికారు. అయినా ఇక్కడ మాత్రం వైసీపీ అభ్యర్థి మగ్బుల్ అహమ్మద్ ఎన్నికల సభల్లో ఎన్‌ఆర్‌సీ అంటే ముస్లింల ఆస్తులు లాక్కొని బయటకు పంపివేయడమే అని వక్రభాష్యాలు చెబుతున్నారు. ఈ రకమైన మాటలు మైనార్టీలను మభ్యపెట్టాడనికి చెబుతున్నారని ఆ వర్గాల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మగ్బుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ వర్గాల వారే అంటున్నారు. మైనార్టీలను మోసం చేయడానికి ఇలాంటి మాటలు చెబుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కదిరిలో నిలకడలేని నాయకత్వం నిలుస్తుందాని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాలకు ఒక కొత్త అభ్యర్థిని బరిలోకి దింపే వైసీపీ ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకుంటుందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీలను మభ్యపెట్టడుతున్న వైసీపీ

మైనార్టీలను వైసీపీ మభ్యపెడుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి గత పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టిన దాదాపు అన్ని బిల్లులకు మద్దతు తెలిపింది. ఎన్‌ఆర్‌సీ, సీఏఏ లాంటి అంశాలకు అండగా నిలిచింది. త్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 వంటి బిల్లులకు మద్దతు తెలిపింది. వైసీపీ మంత్రి ఇటీవలే మాట్లాడుతూ తాము బీజేపీకే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పెట్టిన పార్టీ వైసీపీ అని, అందుకే తాము బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. కదిరిలో మాత్రం మైనార్టీల ప్రచార సభల్లో ఎన్‌ఆర్‌సీ అంటే ముస్లింల ఆస్తులను లాక్కొని బయటకు పంపడమేనని కదిరి వైసీపీ అభ్యర్థి మగ్బుల్ చెబుతున్నారు. ఇలాంటి మాటలు మైనారిటీ ఓట్ల కోసమేనని అంటున్నారు. అసత్యాలను నిజాలుగా చెప్పి ఓట్లు దండుకోవడానికి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నిలకడలేని వైసీపీ నాయకత్వం

కదిరిలో వైసీపీకి నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఎన్నికకు వైసీపీ అభ్యర్థిని మార్చడమే ఇందుకు నిదర్శనం. 2014లో వైసీపీ అభ్యర్థిగా మైనార్టీ వర్గానికి చెందిన అత్తార్ చాంద్‌బాషను బరిలో దింపారు. ఆయన గెలిచిన రెండు సంవత్సరాలకే తెలుగుదేశం పార్టీలోకి చేరిపోయారు. అనక ఇటీవల మళ్లీ వైసీపీలోకి జంప్ అయ్యారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని బరిలో నిలిపారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అంతర్గత వర్గ పోరుతోనే సరిపోయింది. నియోజక వర్గ అభివృద్ధి చేసిందేమీ లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనను కనీసం పరిగణలోకి కూడా తీసుకుండా ప్రస్తుత ఎన్నికల్లో బీఎస్ మగ్బుల్ అహమ్మద్‌ను బరిలో దింపారు. మళ్లీ అదే అంతర్గత పోరుసాగుతోంది. ఇలా ప్రతి ఎన్నికకు కొత్తవారిని బరిలోకి దింపడం వారు గెలిచిన తరువాత కనబడకుండా పోవడంపై వైసీపీ కార్యకర్యలతోపాటు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిలకడలేని వైసీపీ నాయకత్వాన్ని నమ్మి మోసపోయామని ప్రజలు విమర్శిస్తున్నారు.

కూతవేటు దూరం కోతకు ఉపయోగపడింది..!

ముఖ్యమంత్రి నియోజకవర్గం పులివెందులకు కదిరి కూత వేటు దూరంలో ఉంది. కదిరి నుంచి దాదాపు 35 కిలోమీటర్లు. అక్కడి అభివృద్ధికి ఇక్కడి అభివృద్ధికి నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది. వందల కోట్లతో అక్కడ అభివృద్ధి జరిగితే ఇక్కడ మాత్రం కోటి రూపాయల అభివృద్ధి కూడా జరగలేదు. ప్రత్యేక నిధులు విడుదల చేయలేదు. కదిరి మాత్రం పులివెందులలో జరిగే హత్యలకు కావలసిన మారాణాయుధాలు సరఫరా చేయడానికి ఉపయోగపడిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మైనార్టీలను మోసం చేస్తున్నారు : డైమండ్ ఇర్ఫాన్, మైనార్టీ నాయకుడు



ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, నాలుగుశాతం రిజర్వేషన్‌లపై కదిరి వైసీపీ అభ్యర్థి మైనార్టీలకు అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీకి వైసీపీ మద్దతు ప్రకటించలేదా..? ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ వంటి ఎన్నో వాటికి బీజేపీ మద్దతు ఇవ్వలేదా..? మైనార్టీల ఓట్ల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలి. టీడీపీతోనే మైనార్టీల రక్షణ, అభివృద్ధి సాధ్యమవుతాయని గుర్తించాలి.



నీరులేక ఎండుతున్న చీనీ చెట్లు



నీరు లేక వదిలేసిన చీనీ తోట

పాలకుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం


ముకుందాపురం రైతుల బతుకు ఛిద్రం
నీరులేక ఎండుతున్న పండ్లతోటలు
ఎమ్మెల్యేకి విన్నవించినా పట్టించుకోని వైనం
నీటి కోసం రైతన్నల ఆక్రందనలు



ట్యాంకర్ ద్వారా సంపులోకి నీరు పెడుతున్న దృశ్యం

గార్లదిన్నె, ఏప్రిల్ 25 : చీనీతోటల పేరు చెబితే టక్కున గుర్తుకు వచ్చేది గార్లదిన్నె మండలం. మరీ ముఖ్యంగా రాష్ట్రంలోనే గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామం చీనిపండ్లకు ఎంతో పేరుంది. ఆ గ్రామంలో సుమారు 550 కుటుంబాలు ఉన్నాయి. అందులో 90 శాతం మంది రైతులే ఉన్నారు. గ్రామం చుట్టూ ఎక్కడ చూసినా చీనీ తోటలే కనిపిస్తాయి. అలాంటి గ్రామానికి పెనుముప్పు పొంచి ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు ఇంకిపోతోంది. పండ్లతోటలు కళ్ల ఎదుటే ఎండిపోతున్నాయి. దీంతో పండ్లతోటలను ఎలాగైనా కాపాడుకోవాలని రైతులు సుమారు 800 అడుగుల లోతు బోర్లు వేస్తున్నా పాతాళగంగమ్మ పైకి రానంటోంది. గార్లదిన్నె, ముకుందాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, పెనకచెర్ల, మర్తాడు, బూదేడు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పండ్ల తోటలను సాగుచేశారు. ముకుందాపురంలోనే సుమారు 20వేల హెక్టార్లలో చీనీ చెట్లను సాగుచేస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారు. దీంతో గ్రామంలో భూగర్భ జలాలు పెంపొందడం ద్వారా తాగునీటితో పాటు వ్యవసాయ తోటల్లో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభ్యమయ్యేవి. ప్రతి ఏటా పీఏబీఆర్ నుంచి కుడి కాలువ ద్వారా వచ్చే నీరు ఈసారి చెరువుకు రాలేదు. చెరువుకు నీరు విడుదల చేయించాలని ముకుందాపురం రైతులు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, విద్యా సలహాదారుడు ఆలూరి సాంబశివారెడ్డికి ఎన్నోసార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యం. చెరువుకు నీరందక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోరుబావుల్లో చుక్క నీరు రావడం లేదు. ఫలితంగా రూ. లక్షలు ఖర్చు చేసి సాగుచేస్తున్న పండ్ల తోటలు కళ్ల ముందు ఎండిపోతుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. కొందరు రైతులు బోర్లలో వచ్చే అరకొర నీటితో పాటు వాటర్ ట్యాంకుల ద్వారా చెట్లకు నీరు అందిస్తుండగా, మరికొందరు చేతకాక వదిలేసుకునే పరిస్థితి నెలకొంది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం.


ఎమ్మెల్యే పట్టించుకోలేదు



గార్లదిన్నె మండలంపైనే నీటి వనరులు ఉన్నాయి. అయినా మండలంలో పండ్లతోటలకు సాగునీరు అందడంలేదు. ఇది ముమ్మాటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే. కరువు పరిస్థితులు వస్తాయి, చెరువులకు నీరు నింపాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరి సాంబశివారెడ్డిని పలుమార్లు అడిగిన ఏ మాత్రం స్పందించలేదు. వారికి రైతుల పట్ల ఏ మాత్రం బాధ్యత లేదు. అధికారులైతే గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడరు. చెరువు నింపి ఉంటే ఈ రోజు నీటి కష్టాలు వచ్చేవి కావు.

- హనుమంతురెడ్డి, రైతు, ముకుందాపురం


పాలకుల నిర్లక్ష్యం.. మాకు శాపం



పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. గ్రామంలో ఉన్న చెరువుకు నీరు నింపి ఉంటే మా గ్రామానికి ఈరోజు ఈ కష్టం వచ్చేది కాదు. గ్రామంలో చీనీ చెట్లనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఏడు ఎకరాల్లో సుమారు 1500 చీనీ చెట్లు సాగుచేసుకున్నా. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల్లో చుక్క నీరు రాలేదు. కన్నబిడ్డల్లా చూసుకున్న చీనీ చెట్లు కళ్ల ముందే ఎండిపోతుంటే ట్యాంకర్ల ద్వారా నీరు తోలుకుంటున్నాం. ట్యాంకు రూ. 1200 చొప్పున రోజు మార్చి రోజు 10 ట్యాంకులు నీళ్లు తోటుకుంటున్నాం.

- అట్టే పెద్దన్న, రైతు ముకుందాపురం

రైతులంటే చులకన..



ఏడు ఎకరాల పొలంలో 1000 చీనీ చెట్లు సాగుచేశాను. బోరుబావుల్లో రోజురోజుకు నీరు తగ్గిపోతున్నాయి. చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు లక్షలు ఖర్చు చేసి నీటి సంపులు ఏర్పాటు చేసుకుని యర్రగుంట్ల, సంజీవపురం గ్రామాల నుంచి ట్యాంకుకు రూ. 1000 నుంచి రూ. 1200 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇలా ఎన్నాళ్లు తోలుకోవాలో దిక్కుతెలియడంలేదు. పంటల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. పెట్టిన పెట్టుబడులే రాలేదు. నీటి సమస్య ఏర్పడి రైతులు అనేక కష్టాలు పడుతుంటే ఇటు అధికారుల..అటు ప్రజాప్రతినిధులు పలకరించిన పాపానపోలేదు.

- సంగప్ప, రైతు, ముకుందాపురం

ప్రజల ఆశ.. ఆకాంక్ష..!

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. అధినాయకత్వంతో పాటు స్థానిక సమస్యలపై అభ్యర్థులు సైతం ఓటర్లకు అనేక హామీలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు ఓటర్లు కూడా తమ ఆశలు, ఆకాంక్షలు వారి ఎదుట వెలిబుచ్చుతున్నారు. మీడియా పలుకరించిన సందర్భంలో మరి కొందరు ఈ ప్రభుత్వంలో జరిగిన నష్టం, వచ్చే ప్రభుత్వం చేయాల్సిన వాటిపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అవి ఇలా...

రైతుల నోట మట్టికొట్టారు



గతంలో వ్యవసాయ, డిప్పు పరికరాలకు 90 శాతం వరకు రాయితీ ఇచ్చేవారు. దీంతో పొలాల్లో బోర్లు వేయించుకుని బొప్పాయి, కలింగర, దోస తదితర పంటలు సాగు చేసుకునేవాళ్లం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీని ఎత్తివేసి రైతుల నోట మట్టికొట్టారు. ఎద్దుల గుంటక పట్టుకారకు రూ.650 పెట్టా. గతంలో రూ.250లకు దొరకేది. నాలుగేళ్లలో రెండితల ధరలు పెరిగి పెట్టుబడి భారంగా మారింది. కష్టపడి పండించిన పంటకు మాత్రం ధరల్లేవు. రూ.50వేల పెట్టుబడికి రూ.5వేలు వస్తే రైతులు ఎలా బాగుపడుతారు? రైతాంగాన్ని అదుకుని అభివృద్ధిబాటలో నడిపించే ప్రభుత్వం రావాలి.

- సూరప్ప, రైతు, చోళసముద్రం


వ్యాపారాలు పడిపోయాయి..



రోజుకు రూ.వెయ్యి జరిగే వ్యాపారం రూ.300లకు పడిపోయింది. రైతుల నుంచి మార్కెట్‌కు చేర్చేందుకు నాలుగు రెట్ల వ్యయం అవుతోంది. ఈ భారం మొత్తం ధరల రూపంలో వినియోగదారులపై పడుతోంది. దీంతో అమ్మకాలు తగ్గిపోయాయి. ఇంటిల్లిపాది కష్టపడినా కూలి గిట్టడంలేదు. పిల్లల చదువులు, పోషణ, అద్దెలు ఇలా అన్ని భారంగా మారాయి. రూపాయి ఖర్చు చేయాలన్నా పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు వచ్చాయి. చిన్న, చిన్న వ్యాపారులకు ఆర్థిక సాయమందించడం. పెట్టుబడులు, రవాణా తదితర వ్యయాన్ని తగ్గించే సామర్థ్యం కలిగిన ప్రభుత్వం వస్తే అందరికీ బాగుటుంది.

- కృష్ణ, కూరగాయల వ్యాపారి

పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి



పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదు. రూ.100తో లీటర్ డీజిల్ కొట్టిస్తే 20 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది. ఐదుగురు ప్రయాణికులతో రూ.20చొప్పున చార్జీలు తీసుకున్నా మొత్తం డీజిలకే సరిపోతుంది. ఇంటికేమి తీసుకెళ్లాలి?, ఆటో రిపేరీలు ఎలా చేయించాలి?. ఏడాదికి రూ.10వేల సాయాన్ని ప్రభుత్వ అందిస్తుంది. ఒక్కసారి ఆటోను షెడ్‌కు తీసుకెళ్తే అంతకుమించి రిపేరీ ఖర్చు చెల్లించాలి. డీజిల్, పెట్రోలు, ఆటోమొబైల్ పరికరాల ధరలు తగ్గించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. అప్పుడే జీవితాలు మారుతాయి.

- గంగా ప్రసాద్, ఆటో డ్రైవర్

బతుకే భారం



డిగ్రీ, పీజీలు చేసినా ఉద్యోగాలు రాకవపోడంతో బతుకే భారంగా మారింది. కష్టపడి చదివించిన తల్లిదండ్రుల శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదు. కుటుంబానికి భరోసాగా నిలవాల్సిన యువత భారంగా మారింది. ప్రభుత్వశాఖల్లో లక్షలాది కొలువులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేద్దామన్న ఇంగితజ్ఞానం ప్రభుత్వానికి లేకుండాపోయింది. ప్రతి సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ ఆశచూపి ఐదేళ్లైనా విడుదలచేయలేదు. కనీసం పరిశ్రమలైనా తీసుకువచ్చిన పాపాన పోలేదు. డీఎస్సీ నోటిఫికేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేసే ప్రభుత్వం వస్తేనే యువతకు ఉద్యోగాలొస్తాయి.


- బాలకృష్ణ, నిరుద్యోగి

- అనంతపురం సెంట్రల్

విద్యుత్ చార్జీల మోత..!

ఐదేళ్లలో వివిధ పేర్లతో వడ్డన... నేటికి కొనసాగుతున్న బాదుడు
పెరిగిన బిల్లులతో లబోదిబోమంటున్న జనం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని జగన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచేశారు. ఒక్కసారి రెండు సార్లు కాదు..ఐదేళ్లలో వివిధ పేర్లలో జనం నెత్తిన విద్యుత్ చార్జీల మోత మోగిస్తూనే ఉన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే బాదుడు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. వినియోగించిన కరెంటుకు బిల్లుకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు మోయలేని భారంగా మారాయి. చార్జీల పేరిట మరోసారి జనం నుంచి దండుకోవడం ప్రారంభించారు. అదనపులోడు మాటునా ముక్కు పిండి వసూలు చేశారు. ఇలా వినియోగదారుల నుంచి వివిధ పేర్లతో విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారు. వాటితోపాటు ఫిక్స్‌డ్ చార్జీల పేరిట రూ.10, కస్టమర్ చార్జీల పేరిట రూ.45, ఎలక్ట్రిసిటీ చార్జీల పేరుతో రూ.5.65, ఎఫ్‌పీపీసీ



కొత్తకొత్త పేర్లతో చార్జీల బాదుడు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త..కొత్త పేర్లతో జనంపై విద్యుత్ చార్జీల మోత మోగించింది. మొదట్లో ఉన్న స్లాబులు మార్చి విద్యుత్ చార్జీలను పెంచింది. తరువాత ట్రూఅప్ చార్జీల పేరిట 2014-15 నుంచి 2018-19 మధ్యకాలంలో వినియోగించిన విద్యుత్‌కు చార్జీలు వసూలు చేయడం మొదలు పెట్టింది. తరువాత ఇందన సర్దుబాబు చార్జీల పేరుతో దాదాపురూ.35నుంచి రూ.40 ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. అదే విధంగా సర్‌చార్జీల పేరిట రూ.25 వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతినెలా రూ.150 అదనంగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా బిల్లులు చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

ఈ స్థాయిలో బాదుడు ఎన్నడూ లేదు



ఈ ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెరిగిన విధంగా ఎన్నడూ చూడలేదు. నెల నెల వందల..వందలు కరెంటు బిల్లు వస్తోంది. ఇంట్లో ఏమైనా కరెంటు వస్తువులు పెరిగాయా అంటే అదీ లేదు. ఈ కరెంటు బిల్లు బాదుడు తట్టుకోలేక ఎండకాలం వచ్చినా కూలర్ ఉన్నప్పటికీ వాడకుండా ఎగపెట్టేశాం. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు భారంగా మారాయి.

- రామాంజనేయులు, పాపంపేట, అనంతపురం

సగానికి పైగా పెరిగింది



గతంలో మా ఇంటికి ప్రతి నెల రూ.200 నుంచి రూ.250 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడైతే ఏకంగా రూ.500 దాటుతోంది. సగానికి సగం కరెంటు బిల్లు పెరిగింది. ట్రూఅప్, ఫిక్స్‌డ్ చార్జీలంటూ బిల్లులో చాలానే ఉంటున్నాయి. కరెంటు వాడినదానికంటే అదనంగా వేస్తున్న చార్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. ఇంత అధ్వాన్న పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదు.

- సాకే బ్రహ్మయ్య, జ్యోతిబసుకాలనీ, అనంతపురం

అడుగుకో గుంత..
ప్రయాణమంటే చింత!

గడచిన ఐదేళ్లలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత ఏర్పడ్డాయి. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. దీనికి ఉదాహరణే గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంక వెళ్లే రోడ్డు. ఈ రోడ్డు సుమారు 10 కిలో మీటర్లు పొడవునా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి సమయంలో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం కోటంక గ్రామ సమీపంలోనే ఉంది. దేవాలయానికి ప్రతి ఆదివారం వందలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడాది మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాలకు జిల్లా నుంచి కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వస్తుంటారు. అయితే గుంతమయమైన రోడ్డు ప్రయాణంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారంత ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య జటిలమైందని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గార్లదిన్నె



గుంతలమయమైన మర్తాడు రోడ్డు

జన కేతనం

ఆంధ్రజ్యోతి

అనంతపురం
శ్రీ సత్యసాయి

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

టీడీపీ వస్తేనే.. రూ.5 భోజనం



నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటిన్

మడకశిరటౌన్, ఏప్రిల్ 25: స్థానిక అమరాపురం రోడ్డులో ఉన్న అన్న క్యాంటిన్ నిరుపయోగంగా మారింది. టీడీపీ పాలనలో ఎంతోమంది ఆకలి తీర్చిన ఈ క్యాంటిన్ వైసీపీ ప్రభుత్వ తీరుతో మూతపడింది. తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రేషన్‌ల కోసం, కోర్టు పనులు ఇతరత్ర వ్యవహారాల మీద ఎంతో మంది ఐదు మండలాల నుంచి మడకశిరకు వచ్చేవారు. వారిలో చాలా మంది మధ్యాహ్నం వేళ అన్న క్యాంటిన్‌లోనే భోజనం చేసేవారు. కేవలం రూ.5లకే రుచికరమైన భోజనం లభిస్తుండటంతో గ్రామంలోని పేదలు సైతం ఇక్కడే తినేవారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు అన్నా క్యాంటిన్ ఎంతో మంది పేదల ఆకలి తీర్చింది. రాష్ట్రంలో అధికారం మారడంతో అన్న క్యాంటిన్‌లు మూతపడ్డాయి. దీనిపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. టీడీపీ అధికారంలోకి వస్తేనే మళ్లీ అన్న క్యాంటిన్ వస్తాయని ప్రజలు అంటున్నారు.

పార్టీ ఏదైనా.. ప్రచారానికి ఓకే..!



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మందుబాబుల్లో సందడి నెలకొంది. ప్రతి రోజూ వారికి పండుగే. మద్యం అందిస్తే చాలు.. పార్టీతో పని లేదు. ఏ పార్టీకైనా ప్రచారం చేసేస్తున్నారు. వారే ముందుండి ప్రచారాన్ని తీసుకెళ్తున్నారు. రోజుకోపార్టీకి ప్రచారం చేస్తున్నారు, మరికొంత మంది మందు బాబులు ఉదయం ఓపార్టీతో సాయంత్రం మరోపార్టీతో కలిసిపోతున్నారు. మద్యం పుష్కలంగా ఉచితంగా దొరుకుతుండటంతో మందుబాబులకు కిక్కు దిగడం లేదు. ఉచితంగా మద్యం దొరుకుతుండటంతో అలవాటు లేని వారు సైతం మందు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మడకశిర రూరల్

టీడీపీ సానుభూతిపరురాలని..

అభాగ్యురాలికి పింఛన్ ఏది



పెన్షన్‌రాని అభాగ్యురాలు అంజినమ్మ

రొద్దం, ఏప్రిల్ 25: మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన అంజినమ్మ భర్త చనిపోయి ఏడాదైనా పింఛన్ ఇవ్వనీకుండా వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన అంజినమ్మ భర్త మల్లప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె టీడీపీ సానుభూతిపరురాలని వలంటీర్లు, స్థానిక వైసీపీ నాయకులు పింఛన్ రాకుండా అడ్డుకున్నారన్న విమర్శలు ఉన్నా యి. అరవై ఏళ్ల వృద్ధురాలైన ఆమె మూడు నెలల కిందట జారి పడటంతో కాలువిరిగి దివ్యాంగురాలైంది. ఈక్రమంలో పింఛన్ కోసం ఎన్నోమార్లు అధికారులు, వలంటీర్లకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. కుల, మతాలు, పార్టీలకతీతంగా పెన్షన్ ఇస్తామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు దీనికేమంటారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చెక్‌పోస్టు పడింది

సరిహద్దుల్లో మూతపడిన చెక్‌పోస్టులు



గౌడనహళ్లి గ్రామ సమీపంలో మూతపడిన చెక్‌పోస్టు

మడకశిర రూరల్ ఏప్రిల్ 25: వైసీపీ పాలనలో సరిహద్దుల్లో మద్యం అక్రమ రవాణాకు గేట్లు ఎత్తేశారనే విమర్శలు వినవస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు చేయడంకోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాటికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. సీసీ కెమేరాలు కూడా ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో ఏడాది తిరగకముందే చెక్‌పోస్టులు ఎత్తివేశారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ప్రస్తుతం ఎన్నిల సమయం కావడంతో కర్ణాటక నుంచి వివిధ మార్గాల్లో మద్యం అక్రమంగా ఆంధ్రలోకి జోరుగా రవాణా అవుతోంది. దీంతో గ్రామాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కాగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోనున్నట్లు సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు.



గ్రామాల్లో సేవించి పారేసిని కర్ణాటక మద్యం ప్యాకెట్లు

నచ్చిన వాళ్లకు ఓటేసేవాళ్లం



నేను యుక్త వయసులో ఉండగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేసేవారు గ్రామాలకు గ్రామ పెద్దలను కలిసేవారు. మద్దతు కోరేవారు. అయితే మాకు ఏ అభ్యర్థి నచ్చితే వారికి ఓటు వేస్తాం అని నిర్మొహమాటంగా గ్రామ పెద్దలు చెప్పేవారు. ఇప్పటిలా ఓటును డబ్బుకు, మందుకు అమ్ముకునే వాళ్లం కాదు. ఎన్నికల రోజు గ్రామ పెద్దలు ఉగ్గని పెట్టేవారు. ఉగ్గని తిని ఎద్దుల బండిలో వెళ్లి ఓటు వేసి వచ్చేవాళ్లం.

- బత్తలపల్లి

ఇప్పటి దాకా ఆ పార్టీకే ఓటు



మొదటి నుంచి కూడా బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే పార్టీకే ఓటు వేస్తూ వచ్చాం. నాకు ప్రస్తుతం 70 సంవత్సరాలు. 1983లో ఎన్టీఆర్ పార్టీ పెట్టి రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు తీసుకొచ్చాడు. దాన్ని మేమంతా గొప్పగా భావించాం. అందుకే అప్పటి నుంచి టీడీపీకే ఓటు వేస్తున్నాం. వైసీపీ వాళ్లు పింఛన్ విషయంలో వృద్ధులను మోసం చేశారు. చంద్రబాబు వస్తే నెలకు రూ.4వేలు ఇస్తానని చెబుతున్నాడు. వృద్ధుల పట్ల శ్రద్ధ చూపేవారికే ఓటు వేస్తాం. పింఛన్ పెంచుతానని చెబుతున్నారు కాబట్టి ఈ సారి మాలాంటి వృద్ధులతో పాటు, దివ్యాంగులు, వితంతువుల ఓట్లు టీడీపీకే పడతాయి.

- శింగనమల

కొత్త కొత్తగా...

తొలిసారి ఓటేయనున్న 5973 మంది



ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు వేల సంఖ్యలో పెరిగారు. వారంతా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోను న్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో 18-19సంవత్సరాలు కలిగిన దాదాపు 5973 మంది యువ ఓటర్లుగా నమోద య్యారు. వీరంతా విజన్ ఉన్న నాయకుడు, సంపద, ఉపాధి, ఉద్యోగాలు సృష్టించి యువత భవితకు గ్యారెంటీ ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవడానికి సిద్ధమైనట్లు చెబుతున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేస్తామని ముక్త కంఠంతో చెబుతున్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గమని, బాధ్యతగా, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకంతో ఓటు వేస్తామని చెబుతున్నారు.

- గుంతకల్లుటౌన్


చేనేత వరం

ప్రపంచ ఖ్యాతిగాంచిన ధర్మవరం పట్టుపరిశ్రమ

- అద్భుత కళాసృష్టికి కొదవలేదు
- నిమ్మలకుంట తోలుబొమ్మలకు అంతర్జాతీయ గుర్తింపు
- అభివృద్ధి లేక కుదేలు
- మహిళా ఓటర్లే అధికం



చేనేత మగ్గం నేస్తున్న కార్మికుడి విగ్రహం





చెన్నకేశవ స్వామి



కాట కోటేశ్వరుడు



బత్తలపల్లిలో పీర్ల భేటీ

అగ్గిపెట్టెలో చీర చుట్టి అపార కీర్తిని దోసిటపట్టిన జగజ్జెట్టి ధర్మవరం చేనేత కార్మికుడు. ధర్మవరం అంటేనే చేనేత పరిశ్రమ గుర్తుకు వస్తుంది. చేనేతకు వరంగా ఖ్యాతిగాంచింది. వేలాది మంది కార్మికులు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. అదేస్థాయిలో చేనేత కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని మగ్గం గుంతలో మగ్గుతున్నా వారి బతుకుల్లో వెలుగులు నింపే నాథుడే లేడు. రానురాను ఆధునిక పోకడలతో కార్మికులు జీవనోపాధిని కోల్పోయే పరిస్థితులు దాపురించాయి. ధర్మవరం మండలంలోని నిమ్మలకుంట తోలుబొమ్మలకు సైతం అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

ధర్మవరం

ధర్మవరం పేరెత్తగానే టక్కున గుర్తు వచ్చేది పట్టుచీరలు. ఇక్కడ చీరల తయారీలో కార్మికుల కళా నైపుణ్యానికి కొదవలేదు. అగ్గిపెట్టెలో ఒదిగేలా పట్టుచీరలు తయారు చేసిన నేతన్న సంపంగి, మయూరా, పద్మారవింద వంటి ఎన్నో సృజనాత్మకతతో కూడిన పట్టువస్త్రంపై తమ కళానైపుణ్యంతో మగువ మెచ్చేలా తయారు చేయడంలో ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారు చేసిన పట్టుచీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పేరుకే గుర్తింపు ఉంది కానీ ఆ నేతన్నలు కడుపు మాత్రం నింపలేని పరిస్థితి పట్టుపరిశ్రమలో నెలకొంది. కనీస ధర కూడా లేకపోవడంతో నేతన్నలు పడుతున్న బాధలు వర్ణణాతీతమే. చేనేత తరువాత వ్యవసాయంపై కూడా ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఆధారపడి జీవిస్తున్నారు. నాయకులు ఈ రెండు రంగాలను పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో చెరువులు నిండినా ఆయకట్టు భూములు మాత్రం సాగులోకి రాకపోవడం ఇక్కడి రైతాంగాన్ని కుంగదీస్తోంది. గత ఏడాది నుంచి తాగునీరు కూడా ధర్మవరానికి ప్రధాన సమస్యగా మారింది. డంపింగ్ యార్డ్ లేక ఎక్కడపడితే అక్కడ చెత్తను వేసే పరిస్థితి మున్సిపాలిటీలో ఏర్పడింది.

ధర్మవరానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే...

శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామంతరాజులుగా ఉన్న క్రియాశక్తి వడియార్ అప్పట్లో వర్షాలు బాగా వస్తున్నా నీరు నిల్వ ఉండేందుకు బావులు పెద్దగా లేకపోవడంతో ధర్మవరం చెరువును తవ్వించారు. చెరువుకు ఏడు మరువలు పెట్టారు. ఒకసారి భారీ వర్షం కారణంంగా ఏడు మరువలు పొంగి పొర్లుతున్నాయి. మరువలు తెగిపోతే చాలా గ్రామాల్లోని ప్రజలు నీటమునిగి పోతారని తెలుసుకున్న చెందిన ధర్మాంబ అనే మహిళ మరువ వద్ద కట్ట తెగిపోకుండా ఉండేందుకు ఆమె అడ్డంగా పడుకుని ప్రాణత్యాగం చేసింది. అప్పుడు గంగమ్మ శాంతించి మరువలు తెగిపోలేదని పురాణాలు చెబుతున్నాయి. చెరువు మరువలు తెగిపోకుండా ప్రాణత్యాగం చేసిన ధర్మాంబ అనే మహిళ పేరును పెట్టారు. కాలక్రమేనా ధర్మాంబ పేరు ధర్మవరంగా మారిందని పెద్దలు చెబుతున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రాలు

ధర్మవరం పట్టణంలో చెన్నకేశవుడి రథోత్సవాలు పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తాడిమర్రి మండలంల మహాశివరాత్రికి చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో ఉత్సవాలు కూడా వైభవంగా నిర్వహిస్తారు. బత్తలపల్లి మండల కేంద్రంలో మొహరం వేడుకలలో భాగంగా పీర్ల స్వాముల భేటీ కార్యక్రమాన్ని కూడా ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ముదిగుబ్బమండలంకమ్మవారిపల్లి గ్రామంలో వీరనారాయణస్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

రాజకీయ చరిత్ర

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భాగమైన ధర్మవరం మద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడే నియోజకవర్గంగా ఏర్పడింది. నియోజకవర్గ విస్తీర్ణం 1,33,361 హెక్టార్లు ఉండగా, 3,04706 జనాభా ఉంది. ఇందులో పురుషులు 1,55,211 మంది, మహిళలు 1,49,495 మంది ఉన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా అవతరించి ధర్మవరం నియోజకవర్గం ఆ జిల్లాలో భాగమైంది. ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1951లో నియోజకవర్గం ఏర్పాటుకాగా 1952లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున ధర్మవరం పట్టణానికి చెందిన కాశెట్టి శ్రీనివాసులు గెలుపొందారు. ఈయన తన ప్రత్యర్థిపై 16,072 ఓట్లమెజారిటీతో గెలుపొంది మొట్టమొదటి ఎమ్మెల్యేగా సుస్థిర స్థానాన్ని పొందారు. ఎంతో మంది ఎమ్మెల్యేలుగా, జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా, రాష్ట్ర మంత్రులుగా, పీసీసీచీఫ్, ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించిన ఘన చరిత్ర ఉంది. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన గరుడమ్మగారి నాగిరెడ్డి 30,605 ఓట్ల అత్యధిక మెజార్టీ సాధించారు. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన గుత్తా వెంకటనాయుడు 1070 అత్యల్ప మెజారిటీ సాధించారు.

ప్రభావితం చేసే అంశాలు

ధర్మవరంలో పలు అంశాలు ఎన్నికలను ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక్కడ ప్రధానంగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. వీరిపై ఎటువంటి ఇబ్బంది కల్గించిన వారి నుంచి తీవ్ర ప్రభావంచూపే అవకాశం లేకపోలేదు. రైతులకు కూడా సరైన సమయంలో సరైన సహకారం అందించకపోతే ఆ ప్రభుత్వంపై అసంతృప్తి రాగాలు పెల్లుబుకే అవకాశం ఉంటుంది. దీంతో పాటు పింఛన్లు, రోడ్ల సమస్యలపై ప్రజలు అసంతృప్తిని వెళ్లగక్కనున్నారు. తాగు, సాగు నీరు కూడా సక్రమంగా అందించకపోతే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఇక్కడ ప్రధానంగా నెలకొంటుంది. ఇక్కడ ఎవరైనా కబ్జాలు, భూదందాలు, అవినీతికి పాల్పడిన ఆ పార్టీకి ఓటు బ్యాంకు రూపంలో ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంటుంది.

తొలి ఎమ్మెల్యే కాశెట్టి శ్రీనివాసులు

ధర్మవరం నియోజకవర్గం తొలి అసెంబ్లీ అభ్యర్థిగా 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున పోటీ చేసిన కాశెట్టి శ్రీనివాసులు తమ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జి.వెంకటరెడ్డిపై 16,056 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాశెట్టి శ్రీనివాసులు మగ్గం నేసుకుంటూ అప్పటి ధర్మవరం ప్రజల అభీష్టం మేరకు పోటీ చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన గెలుపొందిన తరువాత తమకున్న ఆస్తులను సైతం ప్రజాఉపయోగ కార్యక్రమాలకు కేటాయించారని ఇప్పటికీ స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుతం వీరి కుటుంబం మొత్తం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లింది. మగ్గంతోపాటు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ప్రస్తుతం ఆ కుటుంబం ఆయనతోనే రాజకీయాలకు స్వస్తిపలికినట్లయింది.

నియోజకవర్గ ప్రత్యేకత

ధర్మవరం నియోజకవర్గం ఏర్పడిన తరువాత 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఇందులో తెలుగుదేశం ఆరుసార్లు, కాంగ్రెస్ ఆరుసార్లు, వైపీపీ ఒకసారి, ఇండిపెండెంట్ ఒకసారి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ ఒకసారి గెలుపొందాయి. ఇందులో అత్యధికం, అత్యల్ప మెజార్టీలు టీడీపీ అభ్యర్థులకే దక్కాయి. గరుడమ్మగారి నాగిరెడ్డి ఒక్కరే మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఈయన తెలుగుపార్టీ ఆవిర్భావం నుంచి 1983 నుంచి వరుసగా మూడు సార్లు గెలుపొంది మంత్రిగా పనిచేశారు. ధర్మవరం చేనేత పరిశ్రమకు, నిమ్మలకుంట తోలుబొమ్మలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచడం ఈ నియోజకవర్గంలో ప్రత్యేకతను చాటుకుంది.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	కాశెట్టి శ్రీనివాసులు	కేఎంపీపీ	జి.వెంకటరెడ్డి	కాంగ్రెస్	16,056
1955	పి.రామాచార్యులు	కాంగ్రెస్	బీటీ పక్కీరప్ప	సీపీఐ	24,149
1962	పీవీ చౌదరి	కాంగ్రెస్	ఎల్.నారాయణప్ప	ఇండిపెండెంట్	2,939
1967	పల్లెం వెంకటేశ్	స్వతంత్రపార్టీ	పీవీ చౌదరి	కాంగ్రెస్	3,260
1972	పీవీ చౌదరి	కాంగ్రెస్	జి.అనంతరెడ్డి	ఇండిపెండెంట్	2,307
1978	గోనుగుంట్ల అనంతరెడ్డి	కాంగ్రెస్	సీసీ లక్ష్మీనారాయణరెడ్డి	జనతా	13,177
1983	జి.నాగిరెడ్డి	టీడీపీ	పీవీ చౌదరి	కాంగ్రెస్	30,605
1985	జి.నాగిరెడ్డి	టీడీపీ	జి.పెద్దారెడ్డి	కాంగ్రెస్	12,071
1989	జి.నాగిరెడ్డి	టీడీపీ	జి.నారాయణస్వామి	కాంగ్రెస్	40,421
1994	గుత్తా వెంకటనాయుడు	టీడీపీ	కె.సూర్యప్రతాప్‌రెడ్డి	ఇండిపెండెంట్	1070
1999	కె.సూర్యప్రతాప్‌రెడ్డి	కాంగ్రెస్	జి.విజయ్‌కుమార్	టీడీపీ	8,660
2004	జి.జయలక్ష్మమ్మ	టీడీపీ	జి.నాగిరెడ్డి	సీపీఐ	3,787
2009	కె.వెంకటరామిరెడ్డి	కాంగ్రెస్	జి.సూర్యనారాయణ	ఇండిపెండెంట్	19,172
2014	జి.సూర్యనారాయణ	టీడీపీ	కె.వెంకటరామిరెడ్డి	వైసీపీ	14,911
2019	కె.వెంకటరామిరెడ్డి	వైసీపీ	జి.సూర్యనారాయణ	టీడీపీ	15,826

ప్రధాన సమస్యలు

ధర్మవరం మండలంలో నడిమిగడ్డిపల్లి, బిల్వంపల్లి, చిగిచెర్ల ఎస్సీకాలనీ, గరుడంపల్లి, సుబ్బరావుపేట, నేటకోట గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం సమీప వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. రాంపురం-ధర్మవరం, ముచ్చురామి-రేగాటిపల్లి, ధర్మవరం నుంచి తుమ్మల,తిప్పేపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. తాడిమర్రి నుంచి ఏకపాదంపల్లి, పుల్లప్పల్లి నుంచి పిన్నదరి, దాడితోట బైపాస్ నుంచి నాయనపల్లి, పార్నపల్లి నుంచి తురకవారిపల్లి గ్రామాల రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, శివంపల్లి బీసీకాలనీ తాగునీటి సమస్య ఉంది. చిల్లవారిపల్లి గ్రామంలో ప్రజలు బాటమ్మగుడి వద్దకు, వ్యవసాయ పొలాల వద్దకు తాగునీటి కోసం వెళుతున్నారు. చిల్లకొండయ్యపల్లిలో ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మరోకాలనీకి వెళ్లి నీటిని తెచ్చుకుంటారు. ఈ ఏడాది చెరువులకు నీరు రాకపోవడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాతవూరు తాగునీటి సమస్య అధికంగా ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. నల్లాయగుంటపల్లి, యాకర్లకుంటపల్లి, గుంజేపల్లి, పొడరాళ్లపల్లి, సంకేపల్లి గ్రామాల సమీపంలో వ్యవసాయ బావులకు లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉంది. యోగివేమన రిజర్వాయర్ వద్దకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. టీకొట్టాలకు వెళ్లే రహదారి కూడా కంకర తేలి నడవడానికి కూడా ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. బత్తలపల్లి మండలంలో అనంతసాగరం, కాటమకుంట, దంపెట్ల పంచాయతీ, పత్యాపురం, చెర్లోపల్లి గ్రామాలలో తాగునీటి సమస్య ఉంది. ఉప్పర్లపల్లి క్రాస్ నుంచి గరిశనపల్లివరకు రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



తోలుబొమ్మలను తయారు చేస్తున్న కళాకారుడు

నిమ్మలకుంట తోలుబొమ్మతో అంతర్జాతీయ ఖ్యాతి

ధర్మవరం అంటేనే చేనేత పరిశ్రమ తరువాత విదేశాల్లో సైతం గుర్తింపు పొందిన కుగ్రామం నిమ్మలకుంట. ఈ గ్రామం తోలుబొమ్మలకు ప్రఖ్యాతిని పొందింది. తెల్లస్క్రీన్‌పై వెనుక వైపు నుంచి తోలుబొమ్మలను ఆడిస్తూ జీవనం పొందుతున్న ఆ కళాకారులు ప్రత్యేక ఆకృతులతో కూడిన గృహోపకరణాలు వంటి వస్తువులు కూడా తయారుచేసి విదేశాలలో క్రయవిక్రయాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. రామాయణం, రామాంజనేయయుద్ధం వంటి చిత్రాలు తోలు చర్మంపై చిత్రీకరించడం వారి కళానైపుణ్యానికి నిదర్శనం. డాక్టరేట్ల నుంచి రాష్ట్రపతి అవార్డుల వరకు కళాకారులు సొంతం చేసుకున్నారు.

ఎవరు కావాలో ఆలోచించండి..!

మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25: మాదిగలకు హక్కుగా అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దుచేసిన సీఎం జగన్, ఐదేళ్ల నుంచి ఆ వర్గ ప్రజలను రోడ్డున పడేశారని మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు మండిపడ్డారు. భవిష్యత్తులో జగన్ కావాలో సంక్షేమాన్ని అందించిన చంద్రబాబు కావాలో విజ్ఞతగా ఆలోచించాలని మాదిగలకు సూచించారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప అధ్యక్షతన పెన్షనర్ల భవన్‌లో మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జే ప్రకాష్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, జైమాదిగ సేవా సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు బెంజిమన్, మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, నవ్య చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, బేడ, బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలతో మాదిగలపై దౌర్జన్యకాండ సాగిందని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేసి సంక్షేమ పథకాలను అమలుచేసే నారా చంద్రబాబునాయుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వర్గీకరణ హామీ పత్రాలను ఆవిష్కరించారు.



ఐక్యత ప్రకటిస్తున్న నాయకులు

పోలింగ్ రోజు ఏజెంట్లే కీలకం

ముదిగుబ్బ, ఏప్రిల్ 25: ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చినవారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరఫున ప్రాధాన్య క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చిన ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌గా అభ్యర్థులు తమకు నమ్మకమైనవారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏమాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే కలుగుతుంది.






నిరుద్యోగ చైతన్య యాత్ర కరపత్రాలు పంపిణీ చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్ , సున్నపుగేరిలో టీడీపీలో చేరిన వారితో దగ్గుబాటి ప్రసాద్

పరిశ్రమల స్థాపన టీడీపీతోనే సాధ్యం

ఈ ఐదేళ్లల్లో జిల్లాకు ఎన్ని పరిశ్రమలొచ్చాయో ఎమ్మెల్యే అనంత చెప్పాలి : దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్ / అనంతపురంరూరల్, ఏప్రిల్ 25: పరిశ్రమల స్థాపన టీడీపీతోనే సాధ్యమని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయినగర్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ షేక్ సిద్దిక్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను ఆయన ప్రారంభించారు. ఆ కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని నిలదీశారు. అనేక మంది ఉన్నత చదువులు చదివినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక మహానగరాలకు వలసలు వెళుతున్నారన్నారు. సామాన్య ప్రజలు సైతం హైదరాబాద్, బెంగుళూరుకు వెళ్లి బతకాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాకు వచ్చిన పరిశ్రమలను వెళ్లగొట్టి పేదలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. తనను గెలిపిస్తే.. అధికారంలోకి రాగానే చంద్రబాబు సహకారంతో ఎస్‌ఈజెడ్‌లు ఏర్పాటు చేసి పరిశ్రమలు తీసుకొచ్చి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. యువత, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహ్మద్, నాయకులు సరిపూటి రమణ, బల్లా పల్ల వి, సైపుద్దీన్, లక్ష్మీనరసింహ, ఓబుల్‌రెడ్డి, పూలబాషా పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

వైసీపీ నుంచి పలువురు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. గురువారం దగ్గుబాటి ప్రసాద్ సమక్షంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కురుబ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో 300 మంది కురబ కులస్థులు టీడీపీలో చేరారు. అలాగే సున్నపుగేరిలో బోయపాటి రమణ, రాగే శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిద్దారెడ్డి, పవన్, షామీర్, శివశంకర్‌లతోపాటు 200 మంది టీడీపీలో చేరారు. తపోవనంలో బళ్లారి చలపతి, బళ్లారి గోవిందు, బళ్లారి సుధాకర్, రామకృష్ణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, లీలావతి, రూప, మనోజ్, అభిషేక్, రత్నమ్మ, అశోక్‌లతో పాటు మరో వంద మంది పార్టీలో చేరారు. వీరికి దగ్గుబాటి ప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ కోసం ఎంతో చేశామని, కానీ తమకు ఎలాంటి గుర్తింపు, ప్రయోజనం లేదని, చంద్రబాబు, దగ్గుబాటి ప్రసాద్ నాయకత్వాన్ని సమర్థిస్తూ తాము టీడీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... కురబలతోపాటు అన్ని వర్గాల ప్రజలు టీడీపీవైపే ఉన్నారన్నారు. టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంకా ఎవరైనా పార్టీలోకి రావాలనుకుంటే ధైర్యంగా రావొచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాళ్ల నాగేంద్ర, రమేష్, రమణ, కురబ నారాయణస్వామి, రాజగోపాల్, బోరంపల్లి ఆంజినేయులు, రాకేష్, నాగరాజు, రాయల్ సందీప్, గోపాల్ పాల్గొన్నారు.

దగ్గుబాటి శ్రీలక్ష్మి ప్రచారం

దగ్గుబాటి ప్రసాద్ సతీమణి దగ్గుబాటి శ్రీ లక్ష్మీ అనంతపురం నగరంలోని 27వ డివిజన్, రెండో డివిజన్ పరిధిలోని ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సరిపూటి రమణ, సరిపూటి శ్రీకాంత్, బల్లాపల్లవి, గుర్రం నాగభూషణం, కంఠాదేవి, దబ్బర వెంకటేష్, పూల బాషా, రజాక్, కృష్ణవేణి, భాస్కర్, శివాజీ, పీరా, భగవాన్ పాల్గొన్నారు.



తపోవనంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో దగ్గుబాటి ప్రసాద్

అట్టహాసంగా పరిటాల సునీత నామినేషన్

రామగిరి, ఏప్రిల్ 25: కూటమి రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత గురువారం రెండో సెట్ నామినేషన్‌ను అట్టహాసంగా దాఖలు చేశారు. భారీ జనసందోహంతో వెంకటాపురం నుంచి రాప్తా డు వెళ్లారు. మొదట పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులు, టీడీపీ శ్రేణులతో కలిసి యల్లమ్మఅమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన టీడీపీ శ్రేణుల మధ్య నామినేషన్ దాఖలు చేయడానికి పరిటాలసునీత కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లారు. మండలంలోని నసనకోటతో పాటు పలు గ్రామాలలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థకు ప్రజలు ఘన స్వాగతాలు పలికారు.

భారీగా బైక్ ర్యాలీ

రాప్తాడు : పరిటాల సునీత నామినేషన్ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో గురువారం భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మరూరు టోల్ గేట్ వద్ద నుంచి రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వరకూ వందల సంఖ్యలో బైక్‌లతో అభిమానులు ఈ ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలకు టీడీపీ జండాలు కట్టుకుని ఉల్లాసంగా ర్యాలీలో పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

ఆత్మకూరు : మండలంలోని పీ సిద్దరాంపురం గ్రామానికి చెందిని వైసీపీ యూత్ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరారు.పార్టీలో చేరిన రాజనేని సురేష్ చైదరి, కోమలపాటి పురషోత్తం మాట్లాడుతూ... వైసీపీలో అరాచకాలను భరించలేక టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పరిటాల సునీత గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బాలాజి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.




మరూరులో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ధర్మవరపు మురళి, టీడీపీలోకి చేరిన పీ సిద్దరాంపురం వైసీపీ నాయకులు

ఆల్ ది బెస్ట్... శ్రావణమ్మ: మాజీ మంత్రి జేసీ

బుక్కరాయసముద్రం / శింగనమల, ఏప్రిల్ 25: శింగనమలలో నామినేషన్‌కు వెళ్తున్న టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. మరవకొమ్మ వద్ద నుంచి ర్యాలీగా వస్తున్న శ్రావణిశ్రీకి దారి మధ్యలో జేసీ దివాకర్‌రెడ్డి ఎదురయ్యారు. కారులో ఉన్న ఆయన వద్దకు శ్రావణిశ్రీ వెళ్లి పలుకరించారు. దీంతో ఆయన జాగ్రత్తగా పని చేసుకో.. ఈ సారి తప్పకుండా గెలుస్తావులే..! జాగ్రత్తగా నామినే షన్ వెయ్యి అంటూ చెప్పి వెళ్లి పో యారు. అంతకు ముందు ఆయన ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డితో నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై ఏకాంతంగా దాదాపు అరగంటపాటు చర్చించారు.



దివాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

ముగిసిన సంగమేశ్వర స్వామి ఉత్సవాలు

కూడేరు, ఏప్రిల్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జోడు లింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున సంగమ్మ, సంగప్ప వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. గురువారం ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్లకు పోనుగంటి ఆర్యవైశ్య సంఘం, ఆకులేటి గ్రామస్థుల ఆధ్వర్యంలో వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అర్చకులు, పురోహితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోనేటి నీటిలో సంగమ్మ, సంగప్పలను త్రిశూల స్నానం చేయించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ రామదుర్గం కిష్టప్ప, ఈఓ రమేష్ బాబు, అర్చకులు మహేష్, పురోహితులు శివశంకర్ శాస్త్రి తెలిపారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

అనంతపురం క్రైం,ఏప్రిల్ 25 :నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మొత్తం 43 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. టీడీపీ - 5, వైసీపీ- 4, సీపీఐ-3, బీఎస్పీ-3, ఎస్‌యూసీఐ-1, ఆల్‌ఇండియా కిసాన్ జనతాపార్టీ-1, సమాజ్‌వాదిపార్టీ-1, ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్-1, జై భీమ్ రావ్‌భారత్ పార్టీ-1, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ)-1, జై భారత్ నేషనల్ పార్టీ-1, స్వతంత్య అభ్యర్థులుగా 21మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు.

రాప్తాడు : రాప్తాడు అసెంబ్లీ స్థానానికి మొత్తం 42 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తరపున 6, వైసీపీ తరపున 5, కాంగ్రెస్ తరపున 3, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ 1, బహుజన పార్టీ 1, నవతరం 1, జై భీమ్ 1, స్వతంత్య అభ్యర్థులు 24 నామినేషన్లు దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల కార్యక్రమం ముగిసినట్లు రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలిపారు.

శింగనమల : నియోజకవర్గం ఈనెల18 నుంచి 25 వరకు 30 నామినేషన్లు దాఖల్ చేసినట్లు ఎన్నికల ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల తెలిపారు. టీడీపీ తరపున మొత్తం నాలుగు నామినేషన్లు వచ్చాయని, అందులో బండారు శ్రావణి మూడు సెట్లు, ఆమె సోదరి ఒక సెట్ దాఖలు చేశారన్నారు. అలాగే వైసీపీ తరఫున వీరాంజినేయులు మూడు సెట్లు, ఆయన సోదరుడు ఒక సెట్ నామినేషన్ అందజేశారన్నారు. ఇక కాంగ్రెస్ నుంచి శైలజానాథ్ రెండు సెట్లు, తెలుగు ప్రజాధికార పార్టీ తరపున ఒకే వ్యక్తి రెండు సెంట్లు, ఆల్ ఇండియా కిసాన్ పార్టీ తరఫున ఒక సెట్, 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు.

నిర్భయంగా ఓటు వేయండి : ఎస్పీ

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 25: రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరు ధైర్యంగా... నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన పులేటిపల్లి, వెంకటంపల్లి, మేడాపురం గ్రామాలను గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లకు సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రామగిరి : మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన కలికివాండ్లపల్లిలో గురువారం సాయంత్రం ఎస్పీ మాధవరెడ్డి పర్యటించారు. ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడారు. గ్రామస్థులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉత్పన్నమైన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

28న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25 : జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలను ఆదివారం స్థానిక వేణుగోపాల్‌నగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కె శాంతరాజ్ తెలిపారు. క్యాడెట్ బాల, బాలికల క్యాటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే రెండో వారంలో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు మరిన్ని వివరాలకు 80198 66943లను సంప్రదించాలని కోరారు.

30న క్రికెటర్ల ఎంపిక పోటీలు

జిల్లా క్రికెట్ అండర్-16 బాలుర జట్టు ఎంపిక పోటీలను మంగళవారం అనంత క్రీడాగ్రామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్రికెట్ కిట్, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు 2024-25 సీజన్‌లో వివిధ పోటీలల్లో పాల్గొంటారన్నారు.

ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేటు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25: జిల్లాకేంద్రంలో ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులపై కలెక్టరు వేటు వేశారు. కోడ్ ఉల్లంఘించి అధికార పార్టీకార్యక్రమాలలో పాల్గొన్న పబ్లిక్‌హెల్త్ విభాగంలో పనిచేస్తున్న డ్రైవర్లు రామాంజినేయులు, పెద్దకుళ్లాయప్పను గురువారం సస్పెండ్ చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డుకు అడ్డంగా కంకర

రెండు నెలలుగా ఇదే పరిస్థితి

అనంతపురం, సిటీ, ఏప్రిల్ 25: నగర శివారులోని ఏ. నారాయణపురం పంచాయతీలోని పాపంపేట పరిధిలోని విద్యారణ్యనగర్, బాలాజీ ఐస్‌ఫ్యాక్టరీ తదితర కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇలా అడ్డంగా రెండు నెలల క్రితం కంకర వేశారు. దీంతో ఆయా కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనుల కోసం ఆ కంకరను కాంట్రాక్టర్ తరలించారు. అయితే పనులు చేయకుండా నిర్లక్ష్యం చేశాడు. నెల తర్వాత కోడ్ రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. అయితే కంకర ఇలా రోడ్డుపై వేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో మరీ దారుణం. అనేక మంది వాహనదారులు జారి పడి.. గాయపడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు చేయకపోయినా... కనీసం ఆ కంకరను రోడ్డుపై తొలగించకపోవడం ఆయా కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుకు అడ్డంగా వేసిన కంకర

క్రీడా శిక్షణ శిబిరాల పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25 : స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్లు ఎంఎస్ కుమార్, రోహిత్‌వర్మ, బీసీసీఐ అంపైర్ రవికాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. బీసీసీఐ, ఏసీఏ అందిస్తున్న సదుపాయాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని భారతజట్టు, ప్రీమియర్ లీగ్ పోటీల్లో స్థానం సాధించాలని వారు ఆకాంక్షించారు. విజయాలపై రహస్యాలు మెళుకువలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్‌పై వివరించారు. అనంతరం ఎస్ఎస్‌బీఎన్, నీలం సంజీవరెడ్డి, పీటీసీ స్టేడియాల్లోని శిబిరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, హెడ్‌కోచ్ రమాదేవి, కోచ్‌లు రవి, యామిని, అనిత, బొమ్మన్న, సాగరిక, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 815 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన కోదండరాముడు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజున గురువారం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో కోదండరాముడు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో అశ్వవాహనంపై స్వామివార్లను పురవీధులగుండా ఊరేగించారు. రథోత్సవానికి ముందు భక్తులు రామకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగారు. రాత్రికి స్వామివార్లకు దశహారతులు సమర్పించారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయని ఈఓ సాకే రమేష్‌బాబు వెల్లడించారు. ఉత్సవాల ముగింపు సూచికగా శుక్రవారం ఉదయం స్వామివార్లకు అభిషేకాలు, 9 గంటలకు వసంతోత్సవం, ధ్వజ అవరోహణం, రాత్రికి శయనోత్సవ సేవతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

29న మండల సమావేశం

రామగిరి, ఏప్రిల్ 25: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజల్‌బాషా, ఏఓ దేవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని అన్నారు.

అరటికి ఈత రక్షణ

ఆత్మకూరు : అరటి పంటను ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆత్మకూరుకు చెందిన రైతు లక్ష్మినారాయణరెడ్డి తాను సాగు చేసిన అరటి పంటను రక్షించుకోవడానికి ఇలా ఈత ఆకులను అరటి మొక్కలకు ఏర్పాటు చేశారు. మండ లంలోని పలువురు రైతులు ఇలా అరటి పంటను రక్షించుకొంటున్నారని ఆయన తెలిపారు.



అరటి మొక్కలకు ఏర్పాటు చేసిన ఈత ఆకులు

రంగనాథునికి పుష్పయాగం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: మండలంలోని ఆలూరుకోనలో జరుగుతున్న రంగనాథ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి వసంతోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో అలంరించారు. రాత్రికి ఆలూరు గ్రామంలో స్వామివారు హంసవాహనంపై విహరించారు.

జేఈఈ తుది ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

శశికిరణ్‌కు ఆలిండియా 1,830వ ర్యాంకు



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్, సిబ్బంది

అనంతపురం విద్య, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ తుది ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించినట్లు నారాయణ జూనియర్ కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీన్ శ్రీనివాసరెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం వారు ఆ విద్యార్థులను అభినందించారు. గోసుకొండ శశికిరణ్ 99.89 పర్సంటైల్‌తో 258 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1,830వ ర్యాంకు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. అదేవిధంగా మేఘన ఆలిండియాలో 5,829 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 1,220 ర్యాంకు సాధించిందన్నారు. అన్ని కేటగిరీలలో ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులు 33 మంది ప్రతిష్ఠాత్మక ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీలలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఎంపికయ్యారని తెలిపారు. జనరల్ కేటగిరీలో 93.24 పర్సంటైల్‌లోపు 8 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 81.33లోపు 40 మంది, ఓబీసీఎన్‌సీఎల్ కేటగిరీలో 79.68లోపు 46 మంది, ఎస్సీ కేటగిరిలో 60.09లోపు 24 మంది, ఎస్టీ కేటగిరీలో 46.70 లోపు 28 మంది మొత్తంగా 146 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, ఓబన్న గౌడ్, హిమబిందు, లక్ష్మన్న, శిఖామణి, శ్రీధర్‌బాబు, జయలక్ష్మి, ఏజీఎం కేశవరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

అనంతపురం విద్య, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్ తుది ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఏజీఎం మురళకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రిన్సిపాళ్లు ఆంజినేయులు, దుర్గేష్, రమికుమార్, కిషోర్ ఆధ్వర్యంలో ఫలితాలను ప్రకటించారు. విద్యార్థులు తేజశ్రీకి 13,238 ర్యాంకు, సామియాతాజ్ 22,789 ర్యాంకు, లోకేశ్వర సాయి 25,387 ర్యాంకు, నిహారిక 33,712 ర్యాంకు, శ్రీముఖి 43,039 ర్యాంకు, రోహిత్ వర్మకు 44,596 ర్యాంకు వచ్చినట్లు పేర్కొన్నారు.

టెన్త్ జిల్లా టాపర్‌కి అభినందన



ప్రణతిని అభినందిస్తున్న ఏజీఎం, సిబ్బంది

అనంతపురం విద్య, ఏప్రిల్ 25 : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 598 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన ప్రణతిని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గురువారం హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి, విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ప్రణతి, కీర్తన, తన్విత, శ్రీజరాయల్, నిహారిక, పూజిత, నవ్యశ్రీ, నందిని, రాజ్యశ్రీ, చిన్మయి, చరిత, కీర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని, ఇలాగే ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ శమీనా, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, రజియా పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గార్లదిన్నె, ఏప్రిల్ 25 : మండలంలోని కల్లూరు గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై ఎస్ఐ గౌస్‌బాషా, బీఎస్ఎఫ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోబాలకు గురి చేయకుండా... వాహనాలలో మద్యం, డబ్బులు తరలించకుండా వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు.

నిరుపేద అర్చకుడి కుటుంబానికి చేయూత

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25: అర్చకుడు శ్రీరాములు మృతితో కష్టాలెదుర్కొంటున్న ఆయన కుటుంబానికి నిత్యసురభి ట్రస్టు చేయూతనందించింది. హెచ్చెల్సీ కాలనీలోని షిరిడి సాయిబాబా ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న శ్రీరాములు గతనెల 21న మరణించాడు. ఈ నేపథ్యంలో సదరు కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి గురువారం శ్రీరాములు కుటుంబ సభ్యులను కలిసి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రేఖ, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందజేస్తున్న నిర్మలా మురళి

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డీఎంహెచ్‌ఓ ఈ.బీ. దేవి ఈ ర్యాలీని ప్రారంభించారు. టవర్‌క్లాక్, సప్తగిరిసర్కిల్ మీదుగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమలు వల్లే మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతాయని, వీటి నివారణకు పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని అన్నారు. దోమలను ఎపుడు నియంత్రించినప్పుడే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ ఓబులు, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీఐఓ డాక్టర్ యుగంధర్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్, డెమోలు ఉమాపతి, గంగాధర్, త్యాగరాజు, పలువురు అధికారులు, వైద్యసిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్25: పట్టణంలోని ఏటిగడ్డపాలెంలో ఉన్న ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ హనుమాన్ సమేత ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా గౌరమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ


గౌరమ్మదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 25: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో గురువారం గౌరమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నూతన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో 101 కలశాలతో ఊరేగింపు చేశారు. పురోహితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన సంగమేశ్వరస్వామి ఉత్సవాలు


స్వామి అమ్మవార్లకు చక్రస్నానం చేయిస్తున్న పూజారులు

కూడేరు, ఏప్రిల్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జోడులింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున సంగమ్మ, సంగప్ప వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. గురువారం ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్లకు పోనుగంటి ఆర్యవైశ్య సంఘం, ఆకులేటి గ్రామస్థుల ఆధ్వర్యంలో వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అర్చకులు, పురోహితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోనేటి నీటిలో సంగమ్మ, సంగప్పలను త్రిశూల స్నానం చేయించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ రామదుర్గం కిష్టప్ప, ఈఓ రమేష్ బాబు, అర్చకులు మహేష్, పురోహితులు శివశంకర్ శాస్త్రి తెలిపారు.

రంగనాథునికి పుష్పయాగం


పుష్పయాగంలో రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: మండలంలోని ఆలూరుకోనలో జరుగుతున్న రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి వసంతోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రికి ఆలూరు గ్రామంలో స్వామివారు హంసవాహనంపై విహరించారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: అశ్మిత్ రెడ్డి


మహిళను ఓటు అడుగుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కృష్ణాపురం 2, 3, 4 రోడ్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, విజ్జి, గంగాధర్, రంగనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అశ్మిత్‌రెడ్డి గెలుపునకు అల్లుడి ప్రచారం

యాడికి: మేనమామ జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మేనల్లుడు మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి కుమారుడు గుణపాటి విరాజ్‌రెడ్డి యాడికిలో గురువారం ప్రచారం చేశారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

వెంకటశివుడు యాదవ్‌కు సన్మానం


వెంకటశివుడుయాదవ్‌కు సన్మానిస్తున్న నాయకులు

గుత్తి, ఏప్రిల్ 25: టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటశివుడు యాదవ్‌ను నియమించడంతో ఆ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వెంకటశివుడుయాదవ్ స్వగృహంలో గురువారం ఆయనకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పూలదండలు వేసి, శాలువతో సన్మానించారు. స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ 2018 ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో యాదవులకు పెద్దపీట వేశారని కొనియాడారు. టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా నాయకురాలు పత్తి హిమబిందు, జయరాం సోదరుడు నారాయణ, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, కొనకొండ్ల నూరి, సుధాకర్, సుధాకర్‌నాయుడు, ఎంకే చౌదరి, ఆచారి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తాడిపత్రి విద్యార్థి ప్రతిభ


సాయిహనీష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన సాయి హనీష్‌రెడ్డి ఆల్‌ఇండియా స్థాయిలో 588వ ర్యాంకు సాధించినట్లు విశ్వవిజేత కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు నరేష్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించాడని తెలిపారు. కిషోర్‌కుమార్‌రెడ్డి, సునీత దంపతుల కుమారుడు సాయిహనీష్‌రెడ్డిని అధ్యాపకులు అభినందించారు. పట్టణంలోని సీపీఐకాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు చక్రధర్‌రెడ్డి జాతీయస్థాయిలో 1480వ ర్యాంకు సాధించాడు.

వైసీపీ అభ్యర్థి నామినేషన్‌లో వలంటీర్లు


వైసీపీ నామినేషన్ కార్యక్రమంలో వలంటీర్

బొమ్మనహాళ్, ఏప్రిల్ 25: ఒక వైపు తొలగింపులు, మరోవైపు విమర్శలు అయినా కొందరు వలంటీర్లు వైసీపీ సేవలో తరిస్తున్నారు. గురువారం రాయదుర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బొమ్మనహాళ్ మండలం ఛైలాపురం గ్రామానికి చెందిన వలంటీర్ భాస్కర్ వైసీపీ జెండాను ద్విచక్ర వాహనంకు కట్టుకొని పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. భాస్కర్ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించారు. రాజీనామా చేయకుండానే కార్యక్రమానికి వెళ్లాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను వివరణ కోరగా వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్ భాస్కర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీని గెలిపిస్తే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు: కాలవ


ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే వినియోగదారులకు మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని 23వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో అందించి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీని గెలిపించడం ద్వారా భవిష్యత్తులో పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలవను కలిసిన వెంకటశివుడు యాదవ్

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకటశివుడుయాదవ్ గురువారం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును ఆయన నివాసంలో కలిశారు. కాలవకు పుష్పగుచ్ఛాన్ని అందించి తనకు సహకరించాలని కోరారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై ఆయన కూడా శుభాకాంక్షలు తెలిపారు.

ఓటమి భయంతోనే దాడులు: వైసీపీలో ఓటమి భయం పట్టుకుందని అందుకే టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతోందని కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రవర్ణ వైసీపీ దురహంకారులు నామినేషన్ రోజున టీడీపీకి చెందిన బలహీనవర్గాలపై దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. కృష్ణానాయక్ అనే సోషల్ మీడియా ఇన్‌చార్జిపై అకారణంగా వైసీపీ గూండాలు దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కనిపిస్తే దాడులు చేయాలని వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి చెప్పాడా అని ప్రశ్నించారు. రాతిబావివంక గ్రామంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ హేమ్లానాయక్, ఉద్దేహాళ్ గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంపై దాడి చేసి గాయపరిచారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

వార్డుమెంబర్ టీడీపీలో చేరిక

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో వార్డుమ మెంబర్ అంజినమ్మ వైసీపీని వీడి గురువారం టీడీపీలోకి చేరారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ వన్నూరుస్వామి, మండల కన్వీనర్ కురుబ హనుమంతు, డాక్టర్ రామస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న కాలవ భరత్

దేవరపల్లిలో వైసీపీ ఖాళీ: గుమ్మనూరు


దేవరపల్లిలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

పామిడి, ఏప్రిల్ 25: మండలంలోని దేవరపల్లి గ్రామంలో వైసీపీ ఖాళీ అయ్యిందని ఉమ్మడి అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం వైసీపీకి చెందిన 150 కుటుంబాలు గుమ్మనూరు సమక్షంలో టీడీపీ గూటికి చేరాయి. వారందరికీ ఆయన కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. వంకరాజుకాలువలో 100 కుటుంబాలు, ఎద్దులపల్లి గ్రామంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ, రాష్ట్ర కార్యదర్శి దాసరి లక్ష్మీకాంతమ్మ, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, రామాంజనేయులు నాయక్, రమేష్ నాయక్, ముసలిరెడ్డి, పల్లె శ్రీనివాసులు పాల్గొన్నారు.

మీ కష్టాలన్నీ నాకు తెలుసు: నేను రాజకీయ కుటుంబంలో పుట్టలేదు.. ఓ రైతు కుటుంబంలో పుట్టా.. నాకు అన్ని కష్టాలు తెలుసని గుంతకల్లు అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని నెమళ్లపల్లి, సొరకాయలపేట, ఎద్దులపల్లి, పాళ్యం, అప్పాజీపేట గ్రామాల్లో గురువారం అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పర్యటించారు.

విభిన్న ప్రతిభావంతుల ఆధ్వర్యంలో..: పట్టణంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్ గురువారం టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. బొమ్మా మోహన్‌కృష్ణ, గాదిలింగప్ప, గంపమల్లయ్య, సుంకప్ప, శివకుమార్, మహమ్మద్ రఫీ, తిమ్మప్ప పాల్గొన్నారు.

ముమ్మర ప్రచారం

గుత్తి,: టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాంను భారీ మెజార్టీతో గెలపించాలని పట్టణంలోని గాంధీచౌక్ నుంచి దుకాణాలలో ఆయన సోదరుడు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ విస్తృత ప్రచారం చేశారు. కృష్ణయ్య, రవి, న్యాయవాది సోమశేఖర్, రామాంజనేయులు, రియాజ్, వీరన్న, కేశవనాయుడు, రంగస్వామి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

గుంతకల్లుటౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన 20వైసీపీ కుటుంబాలు గుమ్మనూరు శ్రీనివాసులు సమక్షంలో చేరారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, కసాపురం బలిజ సంఘంఅధ్యక్షుడు తమ్మిశెట్టి రామాంజినేయులు పాల్గొన్నారు.

రెండు ఓట్లూ సైకిల్‌కు వెయ్యండి

గుంతకల్లు: రానున్న పోలింగ్‌లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. పట్టణంలోని 27వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రచారం చేశారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న జయరాం, అంబికా

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి

కణేకల్లు, ఏప్రిల్ 25: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని టీడీపీ నాయకులు అన్నారు. బాబును మళ్లీ రప్పిద్దాం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తకొట్టాలలో ప్రచారం నిర్వహించారు. లాలెప్ప, ఆనంద్ రాజ్, బీటీ రమేష్, నాగభూషణం, చిన్న సలీం, మహ్మద్, ఈరప్ప, నజీర్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన టీడీపీ నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 25: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ నామినేషన్‌కు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు గురువారం 60 వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. టీడీపీ మండల కన్వీనర్ బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, వేణు, రామాంజి, రామానాయుడు, చంద్ర, శ్రీనివాసులునాయుడు, జయుడు, రాజేష్, దస్తగిరి, రాము, సోము, రామాంజనేయులు, నరసింహ ఉన్నారు.

శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 25: పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ యూజీసీ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం అటానమస్ హోదా రావడంపై అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ హోదా రావడం ఆనందంగా ఉందన్నారు. దీని వల్ల కళాశాలలో నాణ్యమైన విద్యాప్రమాణాలు, కళాశాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధికారుల సహకారంతో కళాశాల అభివృద్ధికి అడుగులు వేశారన్నారు. అనంతరం కళాశాలలో బాణాసంచా పేల్చి, నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు

నేడు పయ్యావుల కేశవ్ రోడ్‌షో

బెళుగుప్ప, ఏప్రిల్ 25: మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ రోడ్డు షో నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కాలవపల్లి, 11 గంటలకు హనిమిరెడ్డిపల్లి, 12 గంటలకు గంగవరం, ఒంటి గంటకు ఆవులెన్నలో భోజన విరామం అనంతరం 3 గంటలకు వెంకటాద్రిపల్లి, 4 గంటలకు ఎర్రగుడి, 5 గంటలకు నక్కలపల్లి, 6 గంటలకు శ్రీరంగాపురం, బూదవర్తి గ్రామంలో రోడ్‌షో ముగుస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 25: మండలంలోని పులగుట్టపల్లి గ్రామంలో గురువారం ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన నెట్టికంటయ్య ఇంట్లో గ్యాస్ లీకై వాసన వస్తున్న విషయాన్ని గమనించిన అతను పరిశీలిస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ పేలిందన్నారు. ఇంటిపై కప్పు ధ్వంసమై కూలిపోయిందన్నారు. ఇంట్లో సామగ్రి మొత్తం కాలిపోయిందన్నారు. ప్రమాదంలో నెట్టికంటయ్య అతని భార్య భీమలింగమ్మ, కుటుంబసభ్యులు శాంతమ్మ, వెంకటలక్ష్మి గాయపడ్డారు. గాయపడిన వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం గుంతకల్లు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపప్పూరు, ఏప్రిల్ 25: మండలంలోని చీమలవాగుపల్లి గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్న 11మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.2,42,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శరత్ చంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

వాహనాలను తీయించిన పోలీసులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్25: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో గురువారం వైసీపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్న పలువురు నాయకులు తమ వాహనాలను కాలనీలో అడ్డుగా పెట్టారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు కాకర్ల రంగనాథ చెందిన మద్దతుదారులు తాము బయటకు వెళ్లాలని మీ వాహనాలను పక్కకు తీసివేయాలని వైసీపీ నాయకులను కోరారు. దీనికి వారు ఒప్పుకోకపోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు ఏం జరుగుతుందోనని భయాందోళనలో ఉండడంతో స్పందించిన పోలీసులు వాహనాలను పక్కకు పెట్టించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మాజీ సర్పంచ్‌పై వైసీపీ నాయకుల దాడి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 25: మండలంలోని ఆర్‌బీవంక గ్రామ సమీపంలో కోటగుడ్డ మారెమ్మ దేవాలయం వద్ద ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళుతున్న మాజీ సర్పంచ్ హేమ్లానాయక్‌పై కొందరు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బాబునాయక్, మంజునాథనాయక్, భోజరాజు, బాబునాయక్, హరికృష్ణనాయక్ కలిసి గురువారం దాడి చేసినట్లు బాధితుడు హేమ్లానాయక్ తెలిపాడు. వ్యక్తిగత పని నిమిత్తం రాయదుర్గానికి వెళ్లి గ్రామానికి వస్తుండగా కోటగుడ్డ మారెమ్మ దేవాలయం వద్ద వైసీపీ ఎన్నికల నామినేషన్ కార్యక్రమాన్ని ముగించుకుని దేవాలయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు దుర్భాషలాడి కిందకు పడేసి కొట్టినట్లు చెప్పారు. వైసీపీ నాయకులపై తగుచర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నామినేషన్లకు ముగిసిన గడువు

గుంతకల్లు, ఏప్రిల్ 25: అసెంబ్లీ ఎన్నికలకు గురువారం నామనేషన్ల స్వీకరణకు గడువు ముగిసింది. గుంతకల్లు నియోజకవర్గంలో నామినేషన్ల చివరి రోజున 11 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. గురువారం ఉదయం టీడీపీ తరపున గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు నారాయణ స్వామి, వైసీపీ తరపున వై వెంకటరామిరెడ్డి, ఇండిపెండెంట్లుగా పీ రామాంజనేయులు, చాగంటి ఆదినారాయణ చౌదరి, జీఎం అరుణ్‌కుమార్, టీ భారతి, ఈ పెద్ద ఆంజనేయ, రబ్బోని విక్టర్ హత్తిబెళ్గల్, బీ జయరాం నామినేషన్లు వేశారు. వీరిలో రబ్బోని విక్టర్ నాలుగు సెట్లను దాఖలుచేయగా, మిగిలినవారు ఒక్కో సెట్‌ను వేశారు. నామినేషన్ల పర్వం ముగిసేసరికి వివిధ పార్టీల నుంచి పది మంది, ఇండిపెండెంట్లు పది మంది నామినేషన్లు వేశారు.

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఇప్పటివరకు ఆయా పార్టీల అభ్యర్థులు 17 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో రాణిసుస్మిత గురువారం తెలిపారు. టీడీపీ తరపున రెండు నామినేషన్లు, కాంగ్రెస్ తరపున ఒకటి, ఇండిపెండెంట్ తొమ్మిది, బీఎస్పీ ఒకటి, వైసీపీ ఒకటి, జై భారత్ నేషనల్ పార్టీ ఒకటి, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఒకటి, ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి ఒక నామినేషన్ దాఖలు చేశారన్నారు.

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి రాయదుర్గం నియోజకవర్గానికి 17 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారి తెలిపారు. గురువారం నామినేషన్ల దాఖలు గడువు ముగిసే సమయానికి తొమ్మిది నామినేషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు 17 మంది నామినేషన్లు వేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చిన్నప్పయ్య, తెలుగుదేశం పార్టీ నుంచి కాలవ శ్రీనివాసులు, కాలవ విజయలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మెట్టు గోవిందరెడ్డి, మెట్టు విశ్వనాథరెడ్డి నామినేషన్లు వేశారన్నారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి గురువారం 18 నామినేషన్లు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. టీడీపీ తరపున జేసీ ప్రభాకర్‌రెడ్డి రెండు సెట్లను దాఖలు చేశారు. జేసీ అశ్మిత్‌రెడ్డి రెండ్లు సెట్లను శివ దాఖలు చేశారు. వైసీపీకి చెందిన కేతిరెడ్డి రమాదేవి తరపున పేరం స్వర్ణలత, కేతిరెడ్డి పెద్దారెడ్డి తరపున జిలాన్‌బాషా, బీసీవై పార్టీ ధాకరాజు, ఎస్పీ పార్టీ మహబూబ్‌బాషా నామినేషన్లు దాఖలు చేశారు.

ఉరవకొండ: ఉరవకొండ శాసన సభ ఎన్నికలకు 37 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల చివరి రోజున 16నామినేషన్లు వేశారు. ప్రధానపార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ బీఎస్పీతో పాటు ఇతర పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చివరి రోజు టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ తరపున ఆయన సతీమణి నామినేషన్ వేశారు. టీడీపీ అభ్యర్థి పయ్యావుల శ్రీనివాసులు తరపున ఆ పార్టీ నాయకులు నామినేషన్ వేశారు. వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తరపున ఆయన సతీమణి నామినేషన్ వేశారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్


మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఏప్రిల్ 25: పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. వజ్రకరూరు మండలంలోని ధర్మపురి, చాబాల, ఛాయాపురం, పొట్టిపాడు, కమలపాడు, గూళ్లపాళ్యం గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఐదేళ్లలో వైసీపీ ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలన్నారు. టీడీపీ నాయకులు మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాగేంద్ర, దస్తగిరి, సుబ్బరాయుడు, ఎర్రిస్వామి, ఈశ్వర్, మనోహర్, విజయ్, మాబు, లాలూనాయక్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే చెరువుకు నీరు


ఇప్పేరులో ఎన్నికల ప్రచారంలో పయ్యావుల విక్రమ్ సింహా

కూడేరు: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ఇప్పేరు చెరువుకు నీరు వస్తాయని పయ్యావుల విక్రమ్‌సింహా అన్నారు. గురువారం కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలుపునకు తనయుడు పయ్యావుల విక్రమ్ సింహా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ పయ్యావుల కేశవ్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఆటో బోల్తా... మహిళ మృతి

బెళుగుప్ప, ఏప్రిల్ 25: మండలంలోని ఎర్రగుడి క్రాస్ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడటంతో శీర్పి గ్రామానికి చెందిన గౌరమ్మ (51) అనే మహిళ మృతి చెందగా, మరో మహిళ గాయపడింది. బంధువులు తెలిపిన మేరకు గౌరమ్మ, నాగమ్మతో కలసి స్వగ్రామం నుంచి కూతురును చూడటానికి బెళుగుప్పకు ఆటోలో వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి బోల్తాపడింది. ప్రమాదంలో గౌరమ్మకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆరోగ్య పరిస్థితి విషమంగా వుండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మరో మహిళ నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గౌరమ్మ కుమారుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తేనెటీగల దాడి

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 25: మున్సిపల్ పరిధిలోని దొడగట్ట గ్రామంలో దాదాపు 20 మందిపై తేనెటీగలు దాడిచేశాయి. జ్ఞానభారతి పాఠశాల సమీపంలో రైల్వే బ్రిడ్జి అడుగున తేనెటీగలు పుట్ట ఉంది. గురువారం బ్రిడ్జిపై వెళుతున్న ప్రయాణికులపై ఒక్కసారిగా దాడి చేశాయి. వారు చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. వారికి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో సురక్షితంగా ఇంటికి చేరారని బాధితులు తెలిపారు.

రూ.2.90 లక్షల నగదు పట్టివేత

కుందుర్పి, ఏప్రిల్ 25: మండలం మలయనూరు చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.2.90 లక్షలు నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వీఆర్వోలు సంజీవరెడ్డి, అజిత్ తెలిపారు. నజీర్ మహమ్మద్ కర్ణాటక ప్రాంతం నుంచి కళ్యాణదుర్గం తీసుకెళ్లే క్రమంలో వాటికి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో కళ్యాణదుర్గం ఆర్డీవో రాణిసుష్మితకు నగదును అప్పగించినట్లు తెలిపారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

యాడికి, ఏప్రిల్ 25: సరైన రికార్డులు లేకుండా నాపరాళ్లబండలను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు నంద్యాలజిల్లా అంకిరెడ్డిపల్లి గ్రామం నుంచి యాడికి మండలకేంద్రానికి నాపరాళ్ల బండలను సరైన రికార్డులు లేకుండా తరలిస్తుండడాన్ని గుర్తించిన విజిలెన్స్ అధికారులు వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటికి అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 25: మండలం తార్కాపురం గ్రామం వద్ద 16వ తేదీన ద్విచక్ర వాహనం నుంచి కింద పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. తిమ్మలాపురం గ్రామానికి చెందిన చాకలి ఓబుళేశు(35) అనే వ్యక్తి 16న పాల్తూరు గ్రామంలో వ్యక్తిగత పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తార్కాపురం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత రైతులకుపరామర్శ

పెద్దపప్పూరు, ఏప్రిల్ 25: మండలంలోని వరదాయపల్లి గ్రామంలో రెండురోజులక్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పంటలను నష్టపోయిన రైతులను గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమరసింహ, నారాయణస్వామి, చిన్న మహేశ్‌నాయుడు, కౌన్సిలర్ విజయ్ కుమార్, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

